విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
తెలంగాణ వాణి TV THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107
సంపుటి: 16 | సంచిక : 111 | బుధవారం 19. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

# బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడు సర్వాయి పాపన్న

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరణ
- అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే సర్వాయి పాపన్న విగ్రహానికీ లభించాలి
- "సర్వాయి పాపన్న విగ్రహం పెట్టాలని గీత కార్మికులు తాపత్రయపడ్డారు.
- ట్యాంక్‌బండ్‌పై స్థలాన్ని నేనే సూచించాను.
- ఇక్కడ టూరిజం కార్యాలయం ఉండేది.
- విగ్రహం కోసం ఖాళీ చేయించా.
- ట్యాంక్‌బండ్‌కు పర్యాటకులు ఎవరొచ్చినా పాపన్న విగ్రహం కనిపించేలా స్థలం ఎంపిక చేశాం.
- సర్వాయి పాపన్న గాథను బ్రిటీష్ లైబ్రరీలో పెట్టారు. ఆయన పోరాటం అద్భుతం.
- ప్రజాపాలనలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ఉన్నాయి.
- ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం మాది.
- 2029లోనూ మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.
- నేత, గీత కార్మికులకు పింఛను ఇవ్వాలని ఆదేశించాం.
- ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోంది.
- అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తోంది'



హైదరాబాద్ తెలంగాణ వాణి) బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే సర్వాయి పాపన్న విగ్రహానికీ లభించాలని.. అది నిత్యం స్ఫూర్తిని నింపేలా ఉండాలన్నారు. "సర్వాయి పాపన్న విగ్రహం పెట్టాలని గీత కార్మికులు తాపత్రయపడ్డారు. ట్యాంక్‌బండ్‌పై స్థలాన్ని నేనే సూచించాను. ఇక్కడ టూరిజం కార్యాలయం ఉండేది. విగ్రహం కోసం ఖాళీ చేయించా. ట్యాంక్‌బండ్‌కు పర్యాటకులు ఎవరొచ్చినా పాపన్న విగ్రహం కనిపించేలా స్థలం ఎంపిక చేశాం. సర్వాయి పాపన్న గాథను బ్రిటీష్ లైబ్రరీలో పెట్టారు. ఆయన పోరాటం అద్భుతం. ప్రజాపాలనలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు ఉన్నాయి. ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం మాది. 2029లోనూ మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. నేత, గీత కార్మికులకు పింఛను ఇవ్వాలని ఆదేశించాం.

# ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లు తొలగించింది

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్
- "హైదరాబాద్‌లో బీఎల్‌వోలు ఎవరి ఇంటికీ వెళ్లలేదు.
- పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారు.
- 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉంది
- కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీలాగే ఎన్నికల సంఘాన్ని కూడా తన జేబు సంస్థగా మార్చుకుంది.
- 2002 నాటి ఓటర్ల జాబితాతో ముడిపెట్టకుండా పౌరులకు ఓటు హక్కు కల్పించాలి.
- రాష్ట్రంలో అకారణంగా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది
- మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేసింది.



హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో ఎన్నికల సంఘం తెలంగాణలో నిర్దాక్షిణ్యంగా ఓట్లు తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. సర్ ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. "హైదరాబాద్‌లో బీఎల్‌వోలు ఎవరి ఇంటికీ వెళ్లలేదు. పేదలు, వలస కూలీల ఓట్లనే ఎక్కువగా తొలగించారు.

# మీకోసం 'జనతా గ్యారేజ్' తలుపులు తెరిచే ఉంటాయి..




హైదరాబాద్ తెలంగాణ వాణి) రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో భూములను చేర్చడంపై మాజీ మంత్రి హరీష్ రావు స్పందించారు. మల్కాజ్ గిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నిషేధిత జాబితాలో అన్యాయంగా భూములు చేరినవారి కోసం ప్రభుత్వం పెట్టిన టోల్ ఫ్రీ నంబర్ పనిచేయడం లేదని అన్నారు. అయినప్పటికీ మీ కోసం జనతా గ్యారేజ్ తలుపులు తెరిచే ఉంటాయని బీఆర్ఎస్ భవన్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మూసీలో పేదల ఇళ్లు కూలగొడుతుంటే మూసీ ప్రాంత ప్రజలు జనతా గ్యారేజ్ తలుపులు తోసుకుంటూ వచ్చారని అన్నారు. బీఆర్ఎస్ వాళ్లకు అండగా ఉందని, వారిని కాపాడుకుందని చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రజలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలు ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. జనతా గ్యారేజ్ తలుపులు తెరిచే ఉన్నాయని ఎవరైనా ఎప్పుడైనా రావొచ్చన్నారు. ఎవరు కమీషన్ అడిగినా, ఎవరు పర్సంటేజ్ అడిగినా, ఎవరు మీ ఫ్లాట్ కబ్జా చేసినా తమ వద్దకు రావాలని చెప్పారు. మిమ్మల్ని కాపాడుకుంటామని, ఈ రాష్ట్రంలో అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ప్రజలను కాపాడుకుంటుందని హామీ ఇచ్చారు.

# సేవా కార్యక్రమాలతో కల్పనా చౌదరి జన్మదిన వేడుకలు

- పేదలు, విద్యార్థులు, మహిళలు, కార్మికులకు అండగా కొల్లి ఫౌండేషన్
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తా: కల్పనా చౌదరి








**పాల్వంచ/కొత్తగూడెం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి)** కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కొల్లి కల్పనా చౌదరి జన్మదిన వేడుకలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు సేవా కార్యక్రమాల మధ్య ఘనంగా జరిగాయి. పుట్టినరోజు సందర్భంగా ఆమె పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు.

అనంతరం జగన్నాథపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కల్పనా చౌదరి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రత, విద్యా సామగ్రి తదితర మౌలిక వసతులపై ప్రధానోపాధ్యాయురాలు లతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కొల్లి ఫౌండేషన్ తరపున తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పూలజల్లులతో ఆమెకు స్వాగతం పలికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ

చుంచుపల్లి మండలం రాంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు బాలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయని పేర్కొన్నారు.

కల్పనా చౌదరి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ ఉందని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. రానున్న రోజుల్లో ఫౌండేషన్ సేవలను మరింత విస్తరిస్తామని తెలిపారు.

### ఏజెన్సీ విద్యార్థులకు చేయూత

సుజాతనగర్ మండలం స్టేషన్ బేతంపుడిలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి కూడా సహకరిస్తామని కల్పనా చౌదరి హామీ ఇచ్చారు.
స్థానిక సర్పంచ్ వాంకుడోత్ శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు అండగా నిలుస్తూ, పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కల్పనా చౌదరి ఆకాంక్షించారు.

### ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాల పంపిణీ

కొత్తగూడెంలో ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖాకీ చొక్కాలను పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్‌తో కలిసి కల్పనా చౌదరి ఆటో డ్రైవర్లకు చొక్కాలను అందజేశారు.
ఈ సందర్భంగా కల్పనా చౌదరి మాట్లాడుతూ ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజలకు రవాణా సేవలు అందిస్తున్న ఆటో డ్రైవర్ల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్ మాట్లాడుతూ 'పే బ్యాక్ టు సొసైటీ' స్ఫూర్తితో వివిధ వర్గాల ప్రజలకు సేవలు అందిస్తున్న కొల్లి ఫౌండేషన్ కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

### లబ్ధిదారుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు

లక్ష్మీదేవిపల్లి మండలంలో కొల్లి ఫౌండేషన్ ద్వారా ఉచిత టైలరింగ్ శిక్షణ పొంది కుట్టుమిషన్లు అందుకున్న లబ్ధిదారులు కల్పనా చౌదరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా కల్పనా చౌదరి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ ఫౌండేషన్ సేవలను మరింత విస్తరిస్తామని అన్నారు. పేదలు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఫౌండేషన్ కో-ఆర్డినేటర్లు రూప్లా నాయక్, ఉపేందర్ నాయక్, ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆటో డ్రైవర్లు, ఫౌండేషన్ లబ్ధిదారులు, అభిమానులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# తొక్కిసలాట 7 గురు మృతి

## ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి



హైదరాబాద్ తెలంగాణ వాణి) బీహార్ లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాతికి గురయ్యారు. తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు చేశారు. బిహార్‌లోని లఖిసరాయ్‌లో జరిగిన తొక్కిసలాటలో మిగతా 2లో..

# టివికె మంత్రుల అవినీతి బాగోతం

## లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న అన్నామలై



చెన్నై, ఆగస్ట్ 17: తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రభుత్వంపై మాజీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ టెండర్లు దక్కించుకునే కాంట్రాక్టర్ల నుంచి కొందరు మంత్రులు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డులు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అన్నామలై తాజా వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి. చెన్నైలో నిర్వహించిన పర్యావరణ అవగాహన కార్యక్రమంలో అన్నామలై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి విజయ్ మిగతా 2లో..

# డివిజన్ బెంచ్ అప్పీల్‌కు వెళ్తాం

## తప్పిదం బిఆర్ఎస్‌దే

## జీవోల్లో లోపంతోనే కళ్యాణ, షాదీముబారక్ కు కోర్టు చిక్కులు

## మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి



హైదరాబాద్ తెలంగాణ వాణి) కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మి పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో మిగతా 2లో..

## దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి



**నిర్మల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఇటీవలి భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం బాసర మండలం బిద్రెల్లి సమీపంలోని దెబ్బతిన్న అంతర్రాష్ట్ర రహదారిని పరిశీలించిన ఆయన, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోదావరి తీరంలో పుష్కర ఘాట్ నిర్మించాలి



**నిర్మల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మామడ మండలం పొన్కల్ గ్రామంలోని గోదావరి తీరంలో నూతన పుష్కర ఘాట్ నిర్మించాలని కోరుతూ గ్రామస్థులు నిర్మల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. బ్యారేజీ నిర్మాణంతో గతంలో ఉన్న పుష్కర ఘాట్, ఆలయాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం నాగదేవత, హనుమాన్ ఆలయాల నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కోరారు. దీనిపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని శ్రీహరిరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి



**నిర్మల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులు, సంఘ నాయకులతో కలిసి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి బహుజన రాజ్య స్థాపనకు కృషి చేసిన పాపన్న గౌడ్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, కుల సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాపన్న పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలి



**నిజామాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ భుజంగరావు పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయకనగర్‌లోని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు నేటి తరానికి ఆదర్శమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, బీసీ, గౌడ సంఘాల ప్రతినిధులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కర ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి



**నిజామాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నవీపేట మండలం యంచ వద్ద పుష్కరఘాట్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తులకు రవాణా, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలపై చర్చించారు. ప్రభుత్వ, పట్టా భూములను సర్వే చేసి వారం రోజుల్లో మార్కింగ్ పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

# విద్యలో విజయగాథ: పెరుగుతున్న విద్యా ఆకాంక్షలకు ప్రతీకగా ఒక సమాజం

**NEET** 2026లో వివిధ కోచింగ్ సంస్థల మార్గదర్శకత్వంలో ముస్లిం విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం కేవలం ఒక విద్యా విజయం మాత్రమే కాదు. ఇది మొత్తం సమాజానికి గర్వకారణమైన ఘనతగా, ఎంతోమంది యువతకు స్ఫూర్తినిచ్చే విజయగాథగా నిలుస్తోంది. నాణ్యమైన ఉన్నత విద్యను పొందడం ఇప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన అనేక కుటుంబాలకు సవాలుగా ఉన్న సమయంలో, ఇలాంటి విజయాలు ఆశను, ప్రోత్సాహాన్ని కలిగించడంతో పాటు భవిష్యత్తుకు ఒక స్పష్టమైన మార్గాన్ని చూపిస్తున్నాయి. సరైన మార్గదర్శకత్వం, అవసరమైన వనరులు, అవకాశాలు అందిస్తే ప్రతిభ ఎక్కడ ఉన్నా వెలుగులోకి వస్తుందని, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచగలదని ఈ విజయాలు నిరూపిస్తున్నాయి.

ఈ విద్యార్థుల అద్భుత ఫలితాల వెనుక వారి కృషి, పట్టుదల మాత్రమే కాకుండా, వారి కుటుంబాలు చేసిన త్యాగాలు, విద్యార్థుల ప్రతిభను తీర్చిదిద్దేందుకు సమయం, జ్ఞానం, నైపుణ్యాలను అందించిన ఉపాధ్యాయులు, విద్యావేత్తల అంకితభావం కూడా ఉంది.

వైద్యం, ఇంజినీరింగ్ లేదా ఇతర వృత్తిపరమైన కోర్సుల్లో ప్రవేశం పొందే ప్రతి విద్యార్థి విజయం కేవలం వ్యక్తిగత విజయంగా మిగిలిపోదు. తమ జీవితాలను విద్య ద్వారా మార్చుకోవాలని కలలు కంటున్న ఎంతోమంది యువతకు వారు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తారు.

అందువల్ల ఇలాంటి విజయాలు కొన్ని వ్యక్తిగత ఉదాహరణలుగా మాత్రమే మిగిలిపోకుండా చూడాల్సిన అవసరం ఉంది. ఈ ఫలితాలను సమాజం ఒక కార్యాచరణకు పిలుపుగా భావించాలి. తల్లిదండ్రులు, విద్యావేత్తలు, సామాజిక సంస్థలు, సమాజ నాయకులు కలిసి పనిచేసి మరింత మంది యువతను ఉన్నత విద్య, వృత్తిపరమైన కోర్సులు, పోటీ పరీక్షల వైపు ప్రోత్సహించాలి.

ఏ సమాజం భవిష్యత్తు కేవలం దాని జనాభాతో నిర్ణయించబడదు. ఆ సమాజంలోని యువతకు అందుబాటులో ఉన్న విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు, అవకాశాలే దాని భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఆశాజనకమైన మార్పులు కనిపిస్తున్నాయి. వైద్యం, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, న్యాయశాస్త్రం, పరిశోధన, సివిల్ సర్వీసెస్ తదితర వృత్తిపరమైన రంగాల వైపు విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇంకా చేయాల్సింది చాలా ఉంది.

ఉన్నత విద్యపై అవగాహన ప్రతి ఇంటికీ చేరాలి. ముఖ్యంగా ఆర్థిక పరిస్థితుల కారణంగా లేదా సామాజిక పరిస్థితుల వల్ల ఉన్నత విద్య తమకు అందుబాటులో ఉండదని భావించే కుటుంబాల్లో విద్యపై అవగాహన మరింత పెరగాలి. ఈ విద్యార్థుల విజయగాథలు ఒక ముఖ్యమైన విషయాన్ని నిరూపిస్తున్నాయి---ప్రతిభ ప్రతి చోటా ఉంటుంది. దానికి అవసరమైనది సరైన మార్గదర్శకత్వం, మెంటార్‌షిప్, ఆర్థిక సహాయం మరియు నాణ్యమైన విద్యా వనరులకు ప్రాప్యత.

ఈ లక్ష్య సాధన కోసం కృషి చేస్తున్న విద్యాసంస్థలు, కోచింగ్ సంస్థలు, సామాజిక సంస్థలు ప్రత్యేక అభినందనలకు అర్హులు. వారి పాత్ర కేవలం పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడానికే పరిమితం కాదు.

ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారికి క్రమబద్ధమైన మార్గదర్శకత్వం, విద్యా సహాయం, ప్రోత్సాహం అందించడం ద్వారా వారు ఆశయం, క్రమశిక్షణ, విద్యా ప్రతిభతో కూడిన వాతావరణాన్ని నిర్మిస్తున్నారు.

ఇలాంటి ప్రయత్నాలు విద్యా అసమానతలను తగ్గించడంలో, లేకపోతే మూసుకుపోయే అవకాశాలకు విద్యార్థులకు తలుపులు తెరవడంలో కీలక పాత్ర పోషించగలవు.

ఈ కార్యక్రమాల ప్రభావం కేవలం పరీక్షల ఫలితాల్లోనే కనిపించడం లేదు. విద్యార్థుల ఆలోచనా విధానంలో కూడా మార్పు కనిపిస్తోంది. సాంప్రదాయ పరిమితులను దాటి ఆలోచించడానికి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, తమ సామర్థ్యంపై నమ్మకం పెంచుకోవడానికి ఇవి యువతను ప్రోత్సహిస్తున్నాయి.

అదే సమయంలో విద్యలో పెట్టుబడి పెట్టడం వల్ల దీర్ఘకాలికమైన, సానుకూలమైన మార్పులు సాధ్యమవుతాయని కుటుంబాలు, సమాజాల్లో విశ్వాసం కూడా పెరుగుతోంది.

భారతదేశం జ్ఞానం, ఆవిష్కరణలు, నైపుణ్యాలతో కూడిన మానవ వనరుల ఆధారంగా భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, సమాజంలోని ప్రతి వర్గం ఉన్నత విద్యలో భాగస్వామ్యం కావడం ఎంతో అవసరం.

ఈ **NEET** అభ్యర్థుల విజయం ఒక విషయాన్ని గుర్తుచేస్తోంది---విద్యాభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వాలు, విద్యాసంస్థలదే కాదు. కుటుంబాలు, సామాజిక సంస్థలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, సమాజంలోని ప్రతి ఒక్కరి క్రియాశీల భాగస్వామ్యంతోనే విద్యా పురోగతి సాధ్యమవుతుంది. ఈ విద్యార్థుల విజయాలను ఘనంగా జరుపుకోవాలి. అయితే అదే సమయంలో అవి మరింత పెద్ద విద్యా ఉద్యమానికి స్ఫూర్తిగా మారాలి.

**యువతకు వారి విజయం ఒక స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది:**
ఉన్నత విద్యను లక్ష్యంగా పెట్టుకోండి. పట్టుదలతో ముందుకు సాగండి. అందుబాటులో ఉన్న అవకాశాలను సంకోచం లేకుండా వినియోగించుకోండి. సరైన మార్గదర్శకత్వాన్ని పొందండి. మీ సామర్థ్యంపై నమ్మకం ఉంచండి. విద్యా విజయం వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా, సామాజిక మార్పుకు కూడా శక్తివంతమైన సాధనంగా మారగలదు. ఈ యువ విద్యార్థుల విజయాలపై సమాజం గర్వపడటానికి ప్రతి కారణం ఉంది. అయితే అంతకంటే ముఖ్యంగా, ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి భవిష్యత్ తరాలకు బలమైన విద్యా సహాయ వ్యవస్థలను నిర్మించాల్సిన బాధ్యత ఇప్పుడు మనపై ఉంది. ఈరోజు విద్యార్థులు సాధించిన విజయం అంతిమ గమ్యం కాదు; మరెంతో మంది యువత పెద్ద కలలు కనడానికి, మరింత కష్టపడి పనిచేయడానికి, విద్య ద్వారా ఉజ్వలమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి స్ఫూర్తినిచ్చే ఒక గొప్ప విద్యా మేల్కొలుపుకు ఇది ఆరంభం కావాలి

## జనగామకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి: రాంచందర్ రావు



జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను గుర్తిస్తూ జనగామ జిల్లాకు ఆయన పేరు పెడతామని కాంగ్రెస్ పార్టీ తన 2023 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తుకు చేశారు. ఆయన బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన గొప్ప ప్రజా యోధుడని, ఆనాటి సామాజిక అన్యాయాలు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి, సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేసిన ధీరుడు అని రాంచందర్ రావు కొనియాడారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం స్టేట్ చీఫ్ ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావొస్తున్నా ఆ హామీపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. బీసీ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిన అంశాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. కనీసం తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరును జనగామ జిల్లాకు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత రాజకీయ ఇబ్బంది ఎందుకు? అని ప్రశ్నించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్పష్టంగా డిమాండ్ చేస్తున్నామని, జనగామ జిల్లాకు వెంటనే 'సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జనగామ జిల్లా'గా పేరు మార్చాలని కోరారు.

ఒక రాజుగా ఎదిగి..

బహుజన వర్గాల నుంచి ఎదిగి, ఆనాటి పాలక వ్యవస్థను, మొఘల్ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన యోధుడిగా పాపన్న గౌడ్ చరిత్రలో నిలిచిపోయారని గుర్తుచేశారు. గోల్కొండ కోటపై తన ఆధిపత్యాన్ని స్థాపించి, వేలాది మంది సైనికులతో బలమైన సైన్యాన్ని నిర్మించి, ప్రజల కోసం పోరాటం సాగించారని తెలిపారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ఒక రాజుగా ఎదిగి, బడుగు బలహీన వర్గాలకు ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని నింపిన చరిత్ర సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ది అని అన్నారు. అందుకే ఆయన నేటికీ తెలంగాణ ప్రజల గుండెల్లో ఒక గొప్ప యోధుడిగా, ప్రజా నాయకుడిగా చిరస్థాయిగా నిలిచారని గుర్తుచేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మస్థలం జనగామ జిల్లాలోని ఖిలాషాపూర్ లో ఆయన జీవితం, పోరాటం, నిర్మించిన కోటలు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్.గౌతం రావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హుందాగా పని చేయాలి: మహేష్ కుమార్ గౌడ్




శాసన మండలి ఎథిక్స్ కమిటీ (2026-27) ప్రాథమిక సమావేశం మంగళవారం శాసన మండలి కౌన్సిల్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. శాసన మండలి ఛైర్మన్, గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల ప్రవర్తనలో పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయం, సమానత్వం వంటి విలువలను మరింత బలోపేతం చేయడమే ఎథిక్స్ కమిటీ ప్రధాన లక్ష్యమని ఆయనన తెలిపారు. ప్రివిలేజ్ కమిటీ సభ్యుల హక్కుల గురించి ఏ రకంగా కృషి చేస్తుందో అలాగే ఎథిక్స్ కమిటీ సభ్యుల విలువలను ప్రతిబించేలా పని చేసేందుకు కృషి చేస్తుందని, చట్టసభలో ఉండే సభ్యుల పనితీరును ప్రజలు లోతుగా గమనిస్తారని మనం హుందాగా విలువలను కాపాడుకుంటూ పని చేయాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. శాసనమండలి సభ్యులు, అధికారులు, సిబ్బందికి నైతిక విలువలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేందుకు కమిటీ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరూ ఎక్కడ ఉండాలన్నది ప్రజలే నిర్ణయిస్తారని, రాజకీయాల్లో సద్విమర్శ అవసరమే కానీ విమర్శలు హద్దులు దాటకూడదని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, నైతిక ప్రమాణాల పరిరక్షణకు కమిటీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా శాసనసభ సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని, సభ్యుల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ స్పష్టం చేశారు. సభా చర్చల్లో భాషా వినియోగం విషయంలో కూడా సభ్యులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.



## లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం మోపాలి: కలెక్టర్

**నిజామాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ, ఎంటీపీ చట్టాలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, స్కానింగ్ కేంద్రాలను సీజ్ చేయాలని సూచించారు. గర్భిణీల వివరాలను పక్కాగా నమోదు చేసి, గర్భస్రావాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నిబంధనలు పాటించే కేంద్రాలకే లైసెన్సులు రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. ఆడ, మగ శిశువులు సమానమేనని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**నిర్మల్ - భైంసా: ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో డా.రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి హాజరై, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చైర్మన్ తూమొల్ల దత్తాత్రి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో ముందుకు సాగి తమ జీవిత ఆశయాలను నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో కౌన్సిలర్లు తాలోడ్ శ్రీనివాస్, సుభాష్, ప్రవీణ్, గంగాధర్ గౌడ్, పెండపు కాశీనాథ్, బీజేపీ నాయకులు బాజీరావు, డాక్టర్ మహిపాల్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ గ్రామంలో పెద్ది విగ్రహం పెడుతాం: మాజీ మంత్రి ఎర్రబెల్లి

నర్సంపేటలో ప్రతీ గ్రామంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నర్సంపేటలో సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికిరాత్రే తొలగించారని.. ఎలాంటి నోటుసులు లేకుండా విగ్రహం తొలగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కూల్చివేతలకు కాంగ్రెస్సే కారణమని తెలిపారు. విగ్రహం ఏర్పాటుపై కలెక్టర్, సీపీలకు ముందే సమాచారమిచ్చామని.. భూ యజమాని విద్యాసాగర్ అనుమతితోనే ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వం పెద్ది అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించినప్పుడు విగ్రహాన్ని ఎందుకు కూలగొడుతారని నిలదీశారు. కాంగ్రెస్ నేతలకు సిగ్గుండాలని.. కూల్చిన చోటే మళ్లీ ఏర్పాటు చేయాలని.. లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది పేరు పెట్టాలన్నారు.

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి విగ్రహ కూల్చివేతకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డే కారణమని ఆరోపించారు. తాత్కాలికంగా కాంగ్రెస్ నేతలు ఆనందం పొందుతుండవచ్చు కానీ భవిష్యత్తులో కుమిలి కుమిలి ఏడవక తప్పదని హెచ్చరించారు.

మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ అమీర్‌పేటలో ఇటీవల ఎన్టీఆర్ విగ్రహాన్ని రేవంత్ ఆవిష్కరించారని.. దానికి అనుమతి ఉన్నదా అని ప్రశ్నించారు. అనేక విగ్రహాలు రోడ్డు మధ్యలో ఉన్నాయని.. వాటిని ఎందుకు కూల్చలేదన్నారు. మెడికల్ కాలేజీకి దగ్గర్లో ప్రైవేటు స్థలంలో పెద్ది విగ్రహం ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఇబ్బందేమిటని నిలదీశారు. మాధవరెడ్డి తన పద్ధతి మార్చుకుని పెద్ది విగ్రహాన్ని మళ్లీ ఏర్పాటు చేసేలా చొరవ చూపితే మంచిదని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి. కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అండర్‌పాస్ పనులను పరిశీలించిన ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం రైల్వే అధికారులతో కలిసి నియోజకవర్గంలోని ఎల్‌సీ-249 ఆర్‌యూబీ, జనప్రియ 739 ఆర్‌యూబీ, లోయోలా అకాడమీ ఆర్‌ఓబీ బీపీ-4, వెంకటాపురం ఆర్‌యూబీ బీపీ-5 ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే జోన్లకు చెందిన డీఈఎన్ స్థాయి అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న పనుల ప్రస్తుత పరిస్థితి, ప్రారంభించాల్సిన కొత్త పనులపై అధికారులతో ఎంపీ సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు కొత్తగా చేపట్టాల్సిన పనులను దసరా పండుగలోపు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల మాణిక్యరెడ్డి, శ్రీనివాస్ వర్మ, జె. సురేందర్ రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన డీఎల్పీవో



**మల్లాపూర్:అక్టోబర్20 (తెలంగాణ వాణి)**
మల్లాపూర్ మండలంలోని వెంకటరావుపేట గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని గత కొద్ది రోజుల క్రితం సర్పంచు,ఉప సర్పంచుపై గ్రామానికి చెందిన ఆనందం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినాడు.దీనిపై మంగళవారం డిఎల్పిఓ రాజేంద్రప్రసాద్ వెంకట్రావుపేట గ్రామపంచాయతీకి వచ్చి విధుల దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదు చేసిన ఆనందం ముందర విచారించారు.సంబంధిత పంచాయతీ ఫైల్లను పరిశీలించాడు.అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక సమర్పిస్తానన్నాడు.డిఎల్పిఓ వెంట ఎంపీఓ మహేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్,సర్పంచ్ కనుముల వెంకటేష్,ఉప సర్పంచ్ ఉన్నారు.

## సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**సంస్థాన్ నారాయణపూర్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి)**
: చిమిర్యాల గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ధైర్యసాహసాలు, సామాజిక సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని సర్పంచ్ కొనియాడారు. పాపన్న గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షులు మొగుదాల స్వామి గౌడ్, సభ్యులు ముప్పిడి జంగయ్య గౌడ్ , సుర్వి గాలయ్య గౌడ్ , ఉప్పల సాలయ్య గౌడ్ , మొగుదాల యాదయ్య గౌడ్ , సుర్వి ముత్యాలు గౌడ్ , సుర్వి యాదయ్య గౌడ్ , సుర్వి అంజయ్య గౌడ్ , ముప్పిడి అంజయ్య గౌడ్, మొగుదాల నరసింహ గౌడ్ , సుర్వి శీను గౌడ్,మొగుదాల కృష్ణయ్య గౌడ్, చెరుకు కిషన్ గౌడ్ , ఉప్పల ఎట్టయ్య గౌడ్ , మొగుదాల లింగస్వామి గౌడ్, ఉప్పల నరేష్ గౌడ్ , మొగుదాల లింగస్వామి గౌడ్, మొగుదాల శేఖర్ గౌడ్, ముప్పిడి రాజు గౌడ్, సుర్వి చిన్న అంజయ్య గౌడ్, సుర్వి శంకర్ గౌడ్, ఉప్పల రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు తరాల కోసం వృక్షో రక్షిత.

### ఎల్బీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డిహెచ్ రావు.



**హనుమకొండ ఆగస్టు 18 (తెలంగాణ వాణి టౌన్)**
స్థానిక లాల్ బహదూర్ కళాశాల ఎన్ సి సి 10 తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో" అమ్మ పేరు పై ఒక చెట్టు ప్రతిజ్ఞతో కళాశాల మెడిసినల్ ప్లాంట్ లో మొక్కలు నాటినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డి హెచ్ రావు తెలిపారు. ఎన్ సి సి 10 తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్ఎస్ రామదురై మరియు ఏవో లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, డిజిఎన్ సి సి ఆదేశాల మేరకు 18 ఆగస్టు నుండి 22 ఆగస్టు వరకు అమ్మ పేరు పై ఒక చెట్టు ప్రతిజ్ఞతో నేను ఒక చెట్టు నాటి సంరక్షిస్తాను అనే ప్రతిజ్ఞ చేసి ప్రతి క్యా డేట్స్ మొక్కలు నాటి వాటి పరిరక్షణ తీసుకునే విధంగా ప్రకృతి ప్రేమికులను, వృక్షాలను పెంచే బాధ్యతను తీసుకోవడమే గాక ప్రజల్లో మరింత చైతన్యం పరచాలని చైతన్య పరిచే కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రతిజ్ఞ చేయించాము ఔషధ మొక్కలను కూడా నాటి భవిష్యత్తు తరాల కోసం వృక్షో రక్షిత రక్షిత అనుకుంటూ మొక్కలు నాటారు ప్రతిరోజు వినూతనంగా ఒక ప్రాంతాన్ని ఎంచుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం సదానందం, సీనియర్ కాడేట్స్ మణికంఠ, యాసర్ అరాఫత్, నిఖిల్ సాయి, అలీ, హేమంత్, రాకేష్, సంజయ్, ప్రభు చరణ్ మొదలు వాళ్ళు పాల్గొన్నారు.

## వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి రెడ్డి జన్మదిన వేడుకలు



**వనపర్తి : ఆగస్టు 18, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి రెడ్డి జన్మదిన వేడుకలు కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ ప్రత్యేక పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ , అసోసియేట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు, మెడికల్ ఆఫీసర్లు సమస్త అడ్మినిస్ట్రేటివ్, ల్యాబ్, రక్త నిధి సిబ్బందికి హృదయపూర్వక జన్మదిన వేడుకలు ఘనంగా కేక్ కటింగ్ ఉ సన్మానం శుభాకాంక్షలు తెలిపారు.ప్రిన్సిపాల్ , సీనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో జ్యోతి రెడ్డి తో కేక్ కట్ చేయించి, తోటి సిబ్బంది అంతా ఆమెకు మిఠాయిలు తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు అందజేశారు.వనపర్తి మెడికల్ కాలేజ్ అభివృద్ధిలో, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంలో వైస్ ప్రిన్సిపాల్గా ఆమె అందిస్తున్న అద్భుతమైన సేవలను ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కొనియాడారు. అనంతరం జ్యోతి రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. తన పుట్టినరోజున ఇంతటి ఆత్మీయతను కనబరిచిన ప్రిన్సిపాల్ కి, తోటి డాక్టర్లకు, ల్యాబ్, ఆసుపత్రి సిబ్బంది అందరికీ డాక్టర్ జ్యోతి రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# భద్రకాళి బండ్‌పై ఎలక్ట్రిక్ వెహికిల్ ప్రారంభం

**సందర్శకులకు మరింత సౌకర్యం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**
**హనుమకొండ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి టౌన్)**
: వరంగల్ నగరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రకాళి దేవస్థానం పరిధిలో భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా అభివృద్ధి చేసిన భద్రకాళి బండ్‌పై సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికిల్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కమిషనర్ వెంకన్న, కుడా అధికారులు ఆయనతో కలిసి వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుడా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి చెరువు సుందరీకరణతో వరంగల్ నగరానికి మరింత అందం చేకూరిందన్నారు. భద్రకాళి బండ్‌పై సందర్శకులను ఆకట్టుకునేలా వివిధ అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టినట్లు తెలిపారు. భక్తులు,



నగరవాసులు, పర్యాటకులు ప్రశాంత వాతావరణంలో బండ్‌పై విహరిస్తూ చెరువు అందాలను ఆస్వాదించేలా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు, ఎక్కువ దూరం నడవలేని వారికి ఎలక్ట్రిక్ వెహికిల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. భద్రకాళి దేవస్థానం, చెరువు పరిసరాలను సమగ్రంగా అభివృద్ధి చేసి ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక ఆకర్షణకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, కుడా, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు భద్రకాళి బండ్‌ను వరంగల్ నగరంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. భద్రకాళి చెరువు సుందరీకరణలో భాగంగా బండ్‌పై పచ్చదనం, నడక మార్గాలు, సందర్శకులకు అనుకూలమైన వసతులు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో సందర్శకుల రద్దీకి అనుగుణంగా మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుడా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహం తొలగింపు.. ఉద్యమకారుల అరెస్టులు!

- **ఇదేనా ప్రజాస్వామ్యం?**
- **అక్రమ అరెస్టులపై నాగూర్ల వెంకటేశ్వర్లు ఫైర్**

**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, ( ఆగస్టు 18)**
: తెలంగాణ ఉద్యమకారుల గొంతు నొక్కేలా ప్రభుత్వం వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే, ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని భారీగా పోలీసు బలగాలను మోహరించి తొలగించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.విగ్రహం తొలగింపుతో పాటు అర్ధరాత్రి వేళ తెలంగాణ ఉద్యమకారులను ముందస్తు అరెస్టుల పేరుతో అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు విమర్శించారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను గౌరవించాల్సిన ప్రభుత్వం.. వారి నిరసన హక్కును అణచివేయడం తగదన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని ఎందుకు తొలగించారో



ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదన్నారు. అరెస్టు చేసిన తెలంగాణ ఉద్యమకారులను వెంటనే విడుదల చేయాలని కోరారు.పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం కోసం, తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని నాగూర్ల వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం అణచివేత ధోరణిని విడనాడి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన హితవు పలికారు.

## నేడే కాకతీయ యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

### స్వర్ణోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**హనుమకొండ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
కాకతీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం, స్వర్ణోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. ఆగస్టు 19న ఉదయం 11 గంటలకు విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలోని సెనెట్ హాల్‌లో వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం 50 ఏళ్ల ప్రస్థానంలో సాధించిన విద్యా, పరిశోధనా విజయాలు, సంస్థాగత అభివృద్ధి, ఉన్నత విద్యారంగానికి అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకోనున్నట్లు తెలిపారు. వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి విశ్వవిద్యాలయ ప్రస్థానం, విజయాలు, భవిష్యత్ దార్శనికతపై ప్రసంగించనున్నారు. విశ్వవిద్యాలయ వారసత్వాన్ని స్మరించుకుంటూ విద్యా నాణ్యత, పరిశోధన, సంస్థాగత అభివృద్ధి పట్ల నిబద్ధతను పునరుద్ఘాటించే ఈ వేడుకల్లో బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని రిజిస్ట్రార్ కోరారు.



## ఫార్మ్ పాండ్ స్థల పరిశీలన

**కోరుట్ల రూరల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
గుమ్లాపూర్ గ్రామంలో ఫార్మ్ పాండ్ ఏర్పాటు కోసం ఎంపీడీవో రామకృష్ణ స్థలాన్ని పరిశీలించారు. జియో ట్యాగింగ్, ఫోటో క్యాప్చర్ నిర్వహించి ప్రతి గ్రామంలో కనీసం ఐదు ఫార్మ్ పాండ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, రైతులకు సాగునీటి భద్రతలో ఫార్మ్ పాండ్లు కీలకమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాజల, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్ పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర టీజీ ఈజేఏసీ దృష్టికి తూము రవీందర్




**పెద్దపల్లి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
పెద్దపల్లి జిల్లా టీజీ ఈజేఏసీ కన్వీనర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్ పటేల్ హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యోగులు, అధికారుల సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## పాముకుంట గ్రామంలో యూరియా సబ్ సెంటర్ ప్రారంభం



**రాజపేట ఆగస్టు: 18(తెలంగాణ వాణి విలేఖరి)**
మండల కేంద్ర పాముకుంట గ్రామంలో యూరియా సబ్ సెంటర్ ను మంగళవారం రోజున ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మండల ఫోరమ్ అధ్యక్షుడు సర్పంచ్ రంగ నరేష్ గౌడ్ మండల పిఎసిఎస్ చెర్మన్ నేమిల మహేందర్ గౌడ్, బు డిగే పెంటయ్య గౌడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మెంబెర్ సిల్వేరు బాలరాజు, విట్టల్ నాయక్, డైరెక్టర్ చెక్కల బాలయ్య, శేఖర్ , ఉప సర్పంచ్ షరీఫ్ బత్తిని పాండు , కొలిపాక వెంకట నర్సు,రంగ నరేష్ గుంటి అశోక్ బచ్చలి శేఖర్ రంగ పాండు, ఎండీ మగ్దుమ్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూమి ఇప్పించి న్యాయం చేయండి.

### హుస్నాబాద్ ఆర్డీవోకు వృద్ధురాలి వేడుకోలు.

**హుస్నాబాద్ ఆగస్టు 18 (తెలంగాణ వాణి ఆర్ సి)**



నా భూమి నాకు ఇప్పించి న్యాయం చేయాలని, నా భర్త పేరు మీద ఉన్న భూమిని అక్రమంగా మా పెద్ద కుమారుడు జూపల్లి రాజేశ్వరరావు అక్రమంగా పట్టా చేయించుకున్నాడని అతను తర్వాత తన భార్య జూపల్లి అంజలీదేవి పేరు మీద విరాత్ చేయిం చాడని నాకు ఇద్దరు కుమారులని అందులో చిన్న కుమారుడు జూపల్లి చంద్రశేఖర రావు ఉన్నారని అయితే మొత్తం భూమిని పెద్ద కుమారుడే అనుభవిస్తున్నాడని చిన్న కుమారుడు పేరు మీద కూడా వాటా రాలేదని అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు జూపల్లి భారతమ్మ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.రెండు ఎకరాల 10 గుంటల భూమి మొత్తం ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు లో పోయిందని దాంట్లో భాగంగా నాకు రావాల్సిన భూమినాకు ఇప్పించగలరని, ఆమె విలేకరుల ముందుబోరున విలపించారు. వృద్ధాప్యంలో నా బాగోగులు ఎవరు చూడడం లేదని కాస్త చిన్న కుమారుడు చంద్రశేఖర రావు మాత్రమే మానవతా దృక్పథంతో చూస్తున్నాడని ఆ వాటా పూర్తిగా నాకు గాని నా చిన్న కుమారుడు గాని బదిలాయించాలని ఆమెఅన్నారు.ఇండస్ట్రియల్ పార్కులో భాగంగా నష్టపరిహారం కింద 18 లక్షల రూపాయలు ఎకరం చొప్పున వచ్చాయని ఇట్టి డబ్బులు పెద్ద కుమారుడి భార్యమాత్రమే అనుభవి స్తుందని ఇందులో మాకు కూడా వాట ఉందని ఆమె ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.అన్యాయంగా నా భూమి నాకు తెలవకుండా రిజిస్ట్రేషన్ చేయించు కున్నారని అట్టి భూమిని మళ్లీ నాకు చెందే విధంగా పూర్తి విచారణ జరిపి నాకు న్యాయం చేయాలని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పునరుద్ధరించాలని ధర్నా



**టేక్మాల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ టేక్మాల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భక్తుల వీరప్ప ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ తులసీరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరప్ప మాట్లాడుతూ పేద ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచిన పథకాలపై ప్రభుత్వం వెంటనే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసి, అర్హులైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి , మాజీ ఎంపీపీ చింత స్వప్న రవి, మాజీ సర్పంచ్ నాయి కోటి సుప్రజ భాస్కర్ , మైనార్టీ నాయకులు ఏం ఏ సలీం , మాజీ సర్పంచ్ వరలక్ష్మి సిద్దయ్య , గోవింద చారి, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**చౌటుప్పల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
చౌటుప్పల్ పురపాలక సంఘం కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కౌన్సిలర్లు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తంగడపల్లి రోడ్డు చౌరస్తాలోని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు, రాజకీయ, బహుజన సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి మృతి



**జనగామ / బచ్చన్నపేట ఆగస్టు 18 ( తెలంగాణ వాణి ):**
మద్యానికి బానిసై మృతి చెందిన సంఘట బచ్చన్నపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది స్థానిక ఎస్సై ఏ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన చింతల నాగరాజు (32) తన తల్లిదండ్రులు రెండు సంవత్సరాల క్రితం మృతి చెందగా అప్పటినుండి కూలి పనులు చేస్తూ మద్యానికి బానిసై తిరిగేవాడని మంగళవారం బచ్చన్నపేట మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వెనకాల మృతి మృతి చెందాడని అన్నారు. కుటుంబ సభ్యులు ఎవరి మీద అనుమానం లేదని నాగరాజు మృతికి మద్యమే కారణమని ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏ శ్రీకాంత్ తెలిపారు

## ఇస్రో మూడో ర్యాంకర్‌కు ఘన సన్మానం



**వనపర్తి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
ఇస్రో గ్రూప్-ఏ గెజిటెడ్ ఆఫీసర్స్ పోటీ పరీక్షల్లో మూడో ర్యాంక్ సాధించిన ఎస్. శ్రీమనీష్ గౌడ్‌ను సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ కష్టపడి చదివి లక్ష్యసాధనకు కృషి చేస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శ్రీమనీష్ గౌడ్ ఇస్రోలో ఉద్యోగం సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాగన్న యాదవ్, మాజీ సర్పంచ్ శాంతన్న పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఏం.ఎ.సత్తార్, బైరోజు చంద్రశేఖర్,పి.ఆర్.టి.యు. తెలంగాణ జిల్లా అధ్యక్షుడు బౌద్ధారెడ్డి, బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, డా.బి.శ్యాం సుందర్ ,నిరంజనయ్య, నరసింహా,సంజీవయ్య, శ్రీవర్ధన్ రెడ్డి, గంధం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



**చౌటుప్పల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
తంగడపల్లి గ్రామ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని శేఖర్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, ఆలే శ్రీలత చిరంజీవి, గడ్డం ఇందిరా రాజరత్నం, గౌడ కులస్తులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి





**నర్సాపూర్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పేద ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయొద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని, అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. పేద కుటుంబాలకు అండగా ఉన్న ఈ పథకాలను కొనసాగించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిరిసిల్ల పెద్దూరులో ఘోర అగ్నిప్రమాదం....

### ఒకరు సజీవ దహనం

**రాజన్న సిరిసిల్ల,ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరులో మంగళవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెద్దూరులోని మహాలక్ష్మి ఫర్నిచర్ షాప్ అండ్ గోదాంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీ మహమ్మద్ ఇస్లాం సజీవ దహనమయ్యాడు. ఫర్నిచర్ షాపులో నలుగురు కూలీలు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన ముగ్గురు కూలీలు సురక్షితంగా బయటకు రాగా, మహమ్మద్ ఇస్లాం మాత్రం మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా ఉన్న మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా? లేక ఎవరైనా కావాలని నిప్పు పెట్టారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, డిఎస్పీ నాగేంద్ర చారి లు పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఫైర్ సిబ్బందితో పాటు సీఐ శ్రీనివాస్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.40 నుంచి రూ.45 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫర్నిచర్ షాప్ యజమాని తెలిపారు. అప్పులు చేసి, లోన్లు తీసుకుని షాప్ నిర్వహిస్తున్నానని, అగ్నిప్రమాదంతో తీవ్రంగా నష్టపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని వేడుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## బెజ్జంకి సత్యం ప్రథమ వర్ధంతి ఘనంగా నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ బెజ్జంకి సత్యం ప్రథమ వర్ధంతిని కరీంనగర్ గోదాంగడ్డలోని పీఎంఎల్ ఏసీ బ్యాంకెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సుమారు 600 మంది ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, బంధువులు, స్నేహితులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా సత్యం అందించిన సేవలు, నిజాయితీ, నిబద్ధత, మానవీయ విలువలు చిరస్మరణీయమని కొనియాడారు. కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించగా, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎస్ ఐఆర్‌లో భాగంగా ఓటర్ జాబితా విడుదల



**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 18:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో ఇటీవల చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా గ్రామ ఓటర్ జాబితా మంగళవారం రోజున విడుదల చేశారు . ఈ సందర్భంగా ఓటర్ జాబితాలో ఎలాంటి మార్పులు, చేర్పులు ఉన్నాయో గమనించి ఆగస్టు 17,2026 నుండి సెప్టెంబర్ 16,2026 వరకు ఫామ్6, ఫామ్7, ఫామ్8 ద్వారా అభ్యంతరాలను వ్యక్తం చేసి ఓటర్ జాబితా లో మార్పులు జరిపి చేసుకోవచ్చని తెలిపారు . ఓటర్ జాబితా విడుదల కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ , గ్రామ పాలన అధికారిక గంగాధర్ , గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు .

## తెలంగాణ రాష్ట్ర సేవలో చేరిన మహిళలు



**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 18:( తెలంగాణ వాణి ప్రతినిధి )**
నాగిరెడ్డిపేట మండలంలోని చీనుర్ గ్రామంలో మంగళవారం రోజున గ్రామానికి చెందిన మహిళలు తెలంగాణ రాష్ట్ర సేనలో మండల మహిళ విభాగం అధ్యక్షులు పద్మ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు . ఈ సందర్భంగా మండల మహిళా విభాగం పార్టీ అధ్యక్షులు పద్మ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు . ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ .... తెలంగాణ రాష్ట్ర సేన మహిళ సంక్షేమానికి నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు . కవితక్క నాయకత్వంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, న్యాయం జరిగేలా పోరాటం చేస్తుందన్నారు . ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు క్షుణ్ణంగా తెలుపుతున్నారన్నారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా చీన్నూరు గ్రామం మహిళలు , తెలంగాణ రాష్ట్ర సేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు .

## జర్నలిస్టుల హక్కుల సాధనకు టీయూడబ్ల్యూజే హెచ్-143 నిరంతర కృషి

- అర్హులైన జర్నలిస్టులకు నివేషణ స్థలాల కోసం ఉద్యమం
- హెల్త్ కార్డులను వెంటనే అందించాలి
- పెండింగ్ లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల సమస్యను పరిష్కరించాలి
- జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా



**సిరిసిల్ల,ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమం, స్వేచ్ఛ పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే హెచ్-143 నిరంతరం పోరాడుతుందని జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా అన్నారు. అల్లం నారాయణ, మారుతి సాగర్‌ల సారథ్యంలో సిరిసిల్ల పట్టణంలో మంగళవారం నిర్వహించిన యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులకు నివేశన స్థలాలు, హెల్త్ కార్డులు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ కారణాల చేత అసువులు బాసిన జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ ద్వారా ఆర్థిక సహాయం, పెన్షన్ అందించే కార్యక్రమంలో సంఘం ముందుండి పనిచేస్తుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ టీయూడబ్ల్యూజే హెచ్-143 అధ్యక్షుడిగా పరకాల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రఘువీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను జిల్లా కమిటీ, సభ్యులు, స్థానిక జర్నలిస్టులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. యూనియన్ బలోపేతంతో పాటు సభ్యుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యలను ఐక్యంగా పరిష్కరించేందుకు ముందుండి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల ప్రవీణ్ కుమార్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సామల గట్టు, కోశాధికారి సయ్యద్ ఖలీమ్, ఉపాధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సల్మాన్, మల్లికార్జున్, దారం కృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులు కంటాల విజయ్, మాజీ పట్టణ అధ్యక్షుడు రామనాథం సీనియర్ పాత్రికేయులు చిలుక సత్యనారాయణ, నాగరాజు, బి. శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, భాస్కర్, రఫీ, అస్లాం లతో పాటు జిల్లా నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాబోయే ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్టీయూసిని ఆదరించండి



**ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశం.**
**హుస్నాబాద్ ఆగస్టు18 (తెలంగాణ వాణి ఆర్ సి)**
ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ఉద్యోగభద్రతకల్పించడమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ పనిచేస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేశం అన్నారు. హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట బిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రత కోసం ప్రభుత్వం తరపున పనిచేస్తామని రాబోయే ఆర్టీసీ ఎన్నికలలో గుర్తింపు సంఘమైన ఐఎన్టియుసి నీ ఆదరించాలని ఆయన కోరారు. టీఎంయూకు చెందిన పలువురు కార్మికులు తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ)కు రాజీనామా చేసి ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా మల్లేశం వారికి సంఘం కండువాలు కప్పి స్వాగతించారు. అనంతరం గౌరవ అధ్యక్షులు బొలిశెట్టి శివయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమాని కి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. సమ్మె కాలంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను కూడా త్వరలో ప్రారంభించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. త్వరలో జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీకి కార్మికులు అధిక సంఖ్యలో మద్దతు ఇవ్వాలని కోరారు. అన్ని డిపోల్లో ఐఎన్‌టీయూసీ విజయానికి కార్మికులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి,వైస్ చైర్మన్ చిత్తారి పద్మ,మాజీ గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి,హుస్నాబాద్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రమణ హుస్నాబాద్ ఆర్టీసీ డిపో సెక్రటరీ పి ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణకు రూ.50 వేల సాయం

**మెదక్ జిల్లా, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
హవేలీ ఘనాపూర్ మండలం సర్దన గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణకు గ్రామ పెద్దలు శంకరమేమి బాలకృష్ణరావు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. విగ్రహావిష్కరణకు నిధుల కొరత ఉందని భగత్‌సింగ్ సేన సభ్యులు తెలిపారు. సెప్టెంబర్‌లో విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నామని, దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

## ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడాలి



**రాజపేట, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
తెలంగాణ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాజపేట మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు వెంటనే చెల్లించాలని, పీఆర్సీపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య పథకం పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రేపాక ఉమా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుడుకు జానయ్య పున్నసత్యానంద్ జిల్లా నాయకులు పలుగుల రాజు, శ్రీహరి నాందేవ్ పాల్గొన్నారు.

## ఇసుక లారీలతో రోడ్డు ధ్వంసం : పంజాల సతీష్ గౌడ్



**వీణవంక, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేసే భారీ లారీలతో పోతిరెడ్డిపల్లి--వీణవంక రహదారి పూర్తిగా దెబ్బతిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల ఓ కుటుంబం ప్రమాదానికి గురై గాయపడిందని తెలిపారు. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టిన తర్వాతే ఇసుక రవాణా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పంజాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు క్వారీ వద్ద ధర్నా నిర్వహించారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.



## సహిత విద్యతోనే దివ్యాంగులకు ఉజ్వల భవిష్యత్తు

**తిమ్మాపూర్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
ఎల్ఎండీ కాలనీలోని డైట్ కళాశాలలో మంగళవారం సహిత విద్యపై జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు మెరుగైన విద్య, ప్రత్యేక వసతులు కల్పించేందుకు సిబ్బంది సహిత విద్యపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లు దివ్యాంగులకు అందాల్సిన విద్యా అవకాశాలు, ప్రత్యేక వసతులు, బోధనా పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్, అధికారులు



**మెట్‌పల్లి:ఆగస్టు18(తెలంగాణ వాణి)**
మండలంలోని వెల్లుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజిత్ రెడ్డి పాఠ శాలలోని మధ్యాహ్న భోజన వంటశాలను,వంట సామాగ్రిని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సర్పంచ్ తో పాటు పంచాయతీ పాలకవర్గం, ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,ఏఎన్ఎం,ఆశా వర్కర్లు ఉన్నారు.

## నాంపల్లి మండల తహశీల్దార్ గా అంబటి ఆంజనేయులు



**నాంపల్లి: ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాంపల్లి మండల తహశీల్దార్ గూగులోత్ దేవాసింగ్ దీర్ఘకాల సెలవులో ఉన్నందున నూతన మండల తహశీల్దార్‌గా అంబటి ఆంజనేయులు మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



## గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

**రాజపేట ఆగస్టు: 18(తెలంగాణ వాణి విలేఖరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్ర కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్యం గా ఉన్న సుమారు 100 మంది విద్యార్థులకు మందులు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మోసెస్ రాజు, బీకు నాయక్, బి విజయలక్ష్మి, హెచ్ ఏ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజాపేటలో మట్టి నీరే మంచినీరు : ఎర్రగోకుల జస్వంత్



**రాజాపేట, ఆగస్టు 18 (తెలంగాణ వాణి)**
రాజాపేట మండల కేంద్రంలో మిషన్ భగీరథ ద్వారా అపరిశుభ్రంగా, మట్టితో కూడిన నీరు సరఫరా అవుతోందని జలసాధన సమితి కన్వీనర్, బీఆర్ఎస్ మండల నాయకుడు ఎర్రగోకుల జస్వంత్ ఆరోపించారు. నెల రోజులుగా ఎరుపు రంగులో నీరు వస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకముందే మిషన్ భగీరథ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు.

## ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పాదయాత్ర




**డిండి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
యువతకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఎనమల్ల నవీన్ డిమాండ్ చేశారు. డిండి ప్రజాభవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గోనకల్--డిండి రహదారి గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతోందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే శుక్రవారం గోనకల్ నుంచి డిండి పోలీస్ స్టేషన్ వరకు ఏఐవైఎఫ్ ఆధ్వ ర్యంలో పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చ రించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీపీఎస్ పాఠశాలలో మరమత్తు పనులు ప్రారంభం



**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 18:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో ఇటీవల చేపట్టిన మన గ్రామం మనబడి అనే నినాదంతో ఎంపీపీ ఎస్ పాఠశాలలో మరమత్తు పనులు ప్రారంభించారు . మరమత్తు కొండల్లో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాఠశాలను ఆకర్షణగా తీర్చిదిద్దడానికి పెయింటింగ్ వేస్తున్నారు . బడినే దేవాలయంగా భావించాలని రంగులు వేయిస్తున్నట్లు తెలిపారు . స్వచ్ఛంద సేవలో భాగంగా గొల్లపల్లి నారాయణ , అయ్యపల్లి సాయిబాబా , దాసరి మల్లేష్ , గొల్లపల్లి సురేష్ , మంకిటి గోపాల్ పాల్గొన్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**నాగిరెడ్డి పేట మండలం ఆగస్టు 18:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డి పేట మండల కేంద్రంలో తెలుగు దశ తెలంగాణ పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రోజున రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రాంతంలో రోజున నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సర్వాయి పాపన్న గౌడ రాజ్యం కోసం పోరాటం చేయలేదని గౌరవ అధ్యక్షులు వ్యతిరేకంగా బహుజన విముక్తి కోసం పోరాడిన యోధుడని అన్నారు. సబంధం అణగారిన వర్గాలకు సర్దార్ సర్వాయి పాపన్న ఆదర్శప్రాయడానికి కొనియాడారు . సర్వాయి పాపన్న గౌడ్ కులస్తులు ఆదర్శంగా తీసుకొని మహాయోధుడి అడుగుజాడల్లో నడిచి గౌడ జాతి అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మండల కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కోసం తీర్మానం చేసినట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. రేణుక మాత ఆలయము ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ , మాజీ గౌడ సంఘం అధ్యక్షులు సర్పంచులు ఉపాధ్యక్షులు స్థానిక సర్పంచులు తదితరులు పాల్గొన్నారు .

# కోల్పోయిన వస్తువులపై ఆర్టీసీ అలర్ట్..

- మర్చిపోయిన లంచ్ బాక్స్‌ను తిరిగి ఇచ్చిన సిబ్బంది!
- తక్షణమే స్పందించి కర్తవ్యాన్ని కదిలించిన వరంగల్ వన్ డిపో మేనేజర్
- ఉపయోగంలో లేని టోల్ ఫ్రీ నెంబర్ పై ప్రయాణికుల అసంతృప్తి




**వరంగల్: ఆగస్టు18 (తెలంగాణ వాణి జర్నలిస్ట్)**
నిత్యం వేలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే ప్రజారవాణా వ్యవస్థలో, ఆర్టీసీ సిబ్బంది చూపిన కర్తవ్యపు కదలిక అందరి ప్రశంసలు అందుకుంటోంది. విధి నిర్వహణలో బాధ్యతను చాటుకుంటూ ఓ మహిళా ప్రయాణికురాలికి ఆమె మర్చిపోయిన లంచ్ బాక్సును సురక్షితంగా తిరిగి అందించిన ఘటన వరంగల్ వన్ డిపో పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, హన్మకొండ బస్టాండు నుండి సిద్దిపేట వైపు వెళ్తున్న బస్సులో ప్రయాణికురాలు రమాదేవి తన ఆఫీసు లంచ్ బాక్సును పొరపాటున బస్సులోనే మర్చిపోయారు. వెంటనే విషయం గ్రహించి ఆర్టీసీ టోల్ ఫ్రీ నెంబర్ కు ప్రయత్నించగా స్పందన లేకపోవడంతో, కాసింత అసహనంతో గూగుల్ ద్వారా వరంగల్ వన్ డిపో మేనేజర్‌ను సంప్రదించారు. సదరుడిపో మేనేజర్ ప్రత్యేక సమావేశంలో ఉన్నప్పటికీ, బాధ్యతాయుతంగా స్పందించి సంబంధిత కండక్టర్ నెంబర్ అందించారు. అయితే ఆ కండక్టర్ విధుల్లో లేకపోగా,మరో కండక్టర్ సంపత్ ద్వారా విధుల నిర్వహిస్తున్న కండక్టర్ మల్లికార్జున్ సమాచారాన్ని తెలుసుకున్నారు. వెంటనే మల్లికార్జున్ మానవతా హృదయంతో స్పందించి,ఆఫీస్ లంచ్ బాక్సును రమాదేవి, సమీప బంధువు సంగ రాజు కు హుస్నాబాద్ బస్టాండ్ లో తిరిగి అందించారు. అనంతరం ఆర్టీసీ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, టికెట్ పై ముద్రించిన టోల్ ఫ్రీ నెంబర్ పని చేయకపోవడం ప్రయాణికులలో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. అత్యవసర సమయాల్లో ప్రయాణికులకు సహాయపడాల్సిన ఈ వ్యవస్థను, ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూడాలని ప్రయాణికుల కోరుతున్నారు. కాగ ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది మరియు అధికారులు మాట్లాడుతూ ప్రయాణికులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, అంతేకాకుండా బస్ దిగిన వెంటనే టికెట్ పడేయకుండా కనీసం రెండు మూడు గంటలైనా భద్రపర్చుకోవాలని సూచించారు.

## బహుజన వీరుడు పాపన్న ఆశయ సాధనకు ఐక్యంగా సాగాలి



**కొమురవెల్లి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు పచ్చిమట్ల స్వామి గౌడ్ మాట్లాడుతూ పాపన్న గౌడ్‌ను ఆదర్శంగా తీసుకుని బహుజనులు ఐక్యంగా రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. గీత కార్మికులకు 50 ఏళ్లు నిండిన అర్హులకు ఎలాంటి షరతులు లేకుండా పింఛన్ అందించాలని, జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఖిలాషాపూర్‌లోని పాపన్న కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో మోకు దెబ్బ నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు, కుల పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన డిఎల్పిఓ



**మల్లాపూర్:ఆగస్టు18 (తెలంగాణ వాణి)**
మల్లాపూర్ మండలంలోని వెంకటరావుపేట గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని గత కొద్ది రోజుల క్రితం సర్పంచు,ఉప సర్పంచుపై గ్రామానికి చెందిన ఆనందం ప్రజావాణిలో ఫిర్యాదు చేసినాడు.దీనిపై మంగళవారం డిఎల్పిఓ రాజేంద్రప్రసాద్ వెంకట్రావుపేట గ్రామపంచాయతీకి వచ్చి విధుల దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదు చేసిన ఆనందం ముందర విచారించారు.సంబంధిత పంచాయతీ ఫైళ్లను పరిశీలించాడు.అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక సమర్పిస్తానన్నాడు.డిఎల్పిఓ వెంట ఎంపీఓ మహేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్,సర్పంచ్ కనుముల వెంకటేష్,ఉప సర్పంచ్ ఉన్నారు.

## పాఠశాలల్లో ముగిసిన సోషల్ ఆడిట్.



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 18 (తెలంగాణ వాణి విలేకరి**
)జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలో సోషల్ ఆడిట్ ఈరోజుతో ముగిసిందని మండల విద్యాధికారి బండారి మధు తెలిపారు. మండల విద్యాధికారి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల కోజన్ కొత్తూర్,గోదురు ఉన్నత పాఠశాలలో సోషల్ఆడిట్ జరిగిందని తెలిపారు. ఈ సోషల్ ఆడిట్లో భాగంగా సేఫ్టీ ప్రమాణాలు పాటిస్తున్నారా,సేఫ్టీ కమిటీ నిర్మాణం జరిగిందా,అదేవిధంగా గ్రంథాలయ నిర్వహణ సరిగ్గా జరుగుతుందా, గ్రంథాలయ కమిటీ ఏర్పాటు జరిగిందా, మధ్యాహ్న భోజనం యొక్క మెనూ పాటిస్తున్నారా, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉన్నాయా, టాయిలెట్స్ పక్కాగా ఉన్నాయా,రికార్డ్స్ సరిగ్గా మైంటైన్ చేస్తున్నారా, విద్యార్థులకు రెమిడీయల్ తరగతుల నిర్వహణ జరుగుతున్నదా ఇలా అన్ని విషయాలు క్షుణ్ణంగా పరిశీలించారు.వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీస్ తనిఖీలో భాగంగా పట్టుబడ్డ మోటార్ వైర్ల దొంగలు



**చిలుకూరు ఆగస్టు 18 (తెలంగాణ వాణి)**
చిలుకూరు మండల కేంద్రంలోని నాగిరెడ్డి రామిరెడ్డి గారి పొలం వద్ద బావికి పెట్టిన మోటార్ కేబుల్ వైర్ దొంగలించుక పోయినారని రిపోర్ట్ ఇవ్వగా పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటో లో వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడం తో ప్రయాణిస్తున్న ముగ్గురు, దండగల సురేష్, చింతల గోపమ్మ, సంపంగి గోపి లను విచారణ చేయగా 20 మోటార్ల కేబుల్ దొంగతనం చేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నారని చిలుకూరు గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డిరాంరెడ్డి పిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసి రిమాండ్ కు తరలించ్చినట్లు ఎస్ ఐ బండి మోహన్ బాబు విలేకరుల కు ఓ ప్రకటలో తెలిపారు.

## మహంకాళి ఆలయ ఘటనపై ఎంఆర్.పిఎస్ నాయకుల పరిశీలన



**రామచంద్రపురం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
మహంకాళి ఆలయంలో ఇటీవల జరిగిన ఘటనపై ఎంఆర్.పిఎస్ జిల్లా ఇన్‌చార్జ్ వి.ఎస్. రాజు మాదిగ, ఎంఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ద గీత తదితరులు ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. స్థానికులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఎంఆర్.పిఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

## పాలిటెక్నిక్ వ్యవస్థను 'శక్తి'లో విలీనం చేయొద్దు

**తెలంగాణ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం**
**వరంగల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను 'శక్తి'లో విలీనం చేసే నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని తెలంగాణ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం కోరింది. నైపుణ్యాభివృద్ధి పేరుతో పరిపాలనా మార్పులు చేపడితే విద్యార్థుల ఉన్నత విద్యా అవకాశాలతో పాటు ఉద్యోగుల భవిష్యత్తుపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. పాలిటెక్నిక్ విద్య వృత్తి శిక్షణకే పరిమితం కాకుండా, లేటరల్ ఎంట్రీ ద్వారా ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యకు బలమైన పునాది అని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఐటీఐ, ఏటీసీ, పాలిటెక్నిక్‌లకు ప్రత్యేక లక్ష్యాలు ఉన్నందున వాటిని విలీనం చేయడం కంటే సమన్వయం పెంచడం సముచితమని సూచించారు. గ్రామీణ, పేద




విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులో ఉండేలా చూడాలని, ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, వేతనాలపై హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై విద్యావేత్తలు, ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించాలని సంఘ నాయకులు మారపల్లి సుధాకర్, సిహెచ్. బాబు, గుండరాం సతీష్, పి. చంద్రమ్మ, బానోతు రాజేందర్, దుబ్బ విజయ్ కోరారు.

## జాతీయ మహాసభను విజయవంతం చేయాలి



**వనపర్తి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల కమిటీలను బలోపేతం చేసి సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వనపర్తి జిల్లా ఇంచార్జీ కొమ్ముువారి మస్తాన్ మాదిగ పిలుపునిచ్చారు. తుర్కదిన్నె గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలపై పోరాటానికి మాదిగలు సిద్ధంగా ఉండాలని కోరారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించే జాతీయ మహాసభకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ తుర్కదిన్నె గ్రామ అధ్యక్షులు ఈరపాగ బాలరాజు మాదిగ, అధికార ప్రతినిధి నావిళ్ల శివ మాదిగ, ప్రధాన కార్యదర్శి ఈరపాగ నాగేంద్రంమాదిగ , ఉపాధ్యక్షులు చిన్న శేషయ్య మాదిగ, ఈరపాగ రాములు మాదిగ, పెద్ద శేషయ్య మాదిగ, ఈరపాగ కృష్ణయ్య మాదిగ కార్యదర్శిలు బండారి చెన్నయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు

## పాపన్న విగ్రహావిష్కరణకు తరలిన గౌడన్నలు

**హుస్నాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా హుస్నాబాద్ నుంచి గౌడ సంఘం నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్, 20వ వార్డు కౌన్సిలర్ గోపగోని శోభన్‌బాబు గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం పోరాడిన పాపన్న గౌడ్ చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయడం గౌడ సమాజంతో పాటు తెలంగాణ ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. విగ్రహ



ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## సమగ్ర యువజన విధానం అమలు చేయాలి

**ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర**
**హుస్నాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ఆర్సీ):**
యువత, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సమగ్ర యువజన విధానాన్ని అమలు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర కోరారు. హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఎఐవైఎఫ్ సిద్దిపేట జిల్లా 3వ మహాసభ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ యువతకు నాణ్యమైన విద్య, శాశ్వత ఉపాధి, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి వార్షిక క్యాలెండర్ ప్రకటించాలని, పెండింగ్ నియామకాలు పూర్తి చేయాలని, జిల్లాల వారీగా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, విద్యార్థి హాస్టళ్లు ఏర్పాటు చేయాలని




కోరారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం యువత హక్కులని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభకు ముందు యువజన ప్రదర్శన నిర్వహించగా, మాజీ యువజన నాయకుడు జాగీర్ సత్యనారాయణ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భగవద్గీత జ్ఞాన మందిరంలో వైభవంగా సామూహిక కుంకుమ పూజలు

**జమ్మికుంట, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
జమ్మికుంట పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో అమ్మవారి సామూహిక కుంకుమ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా లలితా పారాయణం, లక్ష్మీ అష్టోత్తర పారాయణం నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది.



అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



## కొల్లూరు ప్రజల దాహార్తి తీర్చేందుకు భరత్ మరో ముందడుగు

**తెల్లాపూర్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
కొల్లూరు ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఉచిత తాగునీటి సౌకర్యం కోసం వాటర్ బోర్‌ను ప్రారంభించారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఉచిత నీటి సౌకర్యం కల్పించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ భరత్‌ను అభినందించారు.

## పోలీస్ తనిఖీ లో భాగంగా పట్టుబడ్డ మోటార్ వైర్ల దొంగలు



**చిలుకూరు ఆగస్టు 18 (తెలంగాణ వాణి)**
చిలుకూరు మండల కేంద్రంలోని నాగిరెడ్డి రామిరెడ్డి గారి పొలం వద్ద బావికి పెట్టిన మోటార్ కేబుల్ వైర్ దొంగలించుక పోయినారని రిపోర్ట్ ఇవ్వగా పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటో లో వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించడం తో ప్రయాణిస్తున్న ముగ్గురు, దండగల సురేష్, చింతల గోపమ్మ, సంపంగి గోపి లను విచారణ చేయగా 20 మోటార్ల కేబుల్ దొంగతనం చేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నారని చిలుకూరు గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డిరాంరెడ్డి పిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసి రిమాండ్ కు తరలించ్చినట్లు ఎస్ ఐ బండి మోహన్ బాబు విలేకరుల కు ఓ ప్రకటలో తెలిపారు.

## అనుమతులు లేకుండా కమర్షియల్ ఫ్లెక్సీలు ముద్రిస్తే చర్యలు తప్పవు

### ఫ్లెక్సీ తయారీదారులకు బల్దియా కమిషనర్ వెంకన్న హెచ్చరిక



**హనుమకొండ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి స్టాఫ్ రిపోర్టర్):**
గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో బల్దియా అనుమతులు లేకుండా కమర్షియల్ ఫ్లెక్సీలను ముద్రించినా, అనధికారికంగా ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న హెచ్చరించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఫ్లెక్సీ తయారీదారులతో సమావేశం నిర్వహించి, ఫ్లెక్సీల ముద్రణ, ఏర్పాటుపై నిబంధనలను వివరించారు.
ప్రభుత్వ స్థలాలు, భవనాలు, జంక్షన్లు, మీడియన్లు, డివైడర్లు, విద్యుత్ స్తంభాలు, చెట్లపై కమర్షియల్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. బల్దియా సూచించిన ప్రాంతాల్లో ముందస్తు అనుమతులు పొందిన తర్వాతే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.
నిబంధనలు ఉల్లంఘిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనధికారిక ఫ్లెక్సీల నియంత్రణకు పోలీస్ శాఖ సహకారం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

## పాపన్న జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ





**రాజాపేట, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా రాజాపేట మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ప్రభుత్వ విప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ బహుజన రాజ్య స్థాపన కోసం పోరాడిన తొలి బహుజన వీరుడని కొనియాడారు. సామాజిక అసమానతలు, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పాపన్న సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పాపన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోయ మధు ఉపసర్పంచ్ నమిలి కేదారీ గౌడ్ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బూర నర్సయ్య గౌడ్ మాజీ మంత్రి, వి శ్రీనివాస్ గౌడ్ మాజీమంత్రి, సూదగాని హరి శంకర్ గౌడ్ గౌడ సంఘం రాష్ట్ర నాయకులు, ఊట్కూరి అశోక్ గౌడ్, తాల్వార్ సుమన్ గౌడ్, పంజాల జైహింద్ గౌడ్, గోద శ్రీరాములు గౌడ్ వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గుల్లకోటలో ఘనంగా పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**ఎండపల్లి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోటలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి సత్యం గౌడ్ అధ్యక్షతన పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన రాజ్యాధికారం, ఆత్మగౌరవం కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటాలు, త్యాగాలు స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. గౌడులంతా ఐక్యంగా ఉండి పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, కులబంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల సరఫరాను పూర్తిగా అరికట్టాలి

### రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



**నల్లగొండ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఆదేశించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని, ప్రతి పాఠశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా జరిగే ప్రాంతాలు, పాన్‌షాపులు, మెడికల్ షాపులపై ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

## .ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి



**ధర్మారం, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
ధర్మారం మండలంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయ ఆవరణలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాలు, శ్రమజీవుల హక్కుల కోసం పోరాడిన పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటుకు అడుగులు

### యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్



**పటాన్‌చెరు, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
సంగారెడ్డిలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు దిశగా కేంద్ర ప్రభుత్వం స్పందించడం శుభపరిణామమని యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ అన్నారు. ప్రధాన తపాలా కార్యాలయాన్ని ఆధునీకరించడంతో పాటు పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ సంబంధిత శాఖకు పంపడం అభినందనీయమన్నారు. ంగారెడ్డిలో పాస్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటుతో విద్యార్థులు, యువత, విదేశాలకు వెళ్లే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు యువజన సంఘాల సమితి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు

### పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి: ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్‌చెరు, ఆగస్టు 18 (తెలంగాణ వాణి)**
: నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో సుమారు రూ.75 కోట్లతో కొనసాగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్, వీధిదీపాలు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. పోచారం, లకడారం నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లను సెప్టెంబర్‌లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, యూజీడీ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# లక్ష్యంతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

**వెలిమెల పాఠశాలలో ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు**



**పటాన్‌చెరు, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువులో రాణించాలని రామచంద్రాపురం యూనిట్ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి సూచించారు. వెలిమెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు సంఘం ఆధ్వర్యంలో రూ.15 వేల నగదు పురస్కారాలను అందజేశారు. వై. పూజకు రూ.6 వేలు, ఎం. గణేష్‌కు రూ.5 వేలు, టీ. కరుణశ్రీకి రూ.4 వేల చొప్పున బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# భిన్న దృక్కోణాల ద్వారా మానసిక సవాళ్లను పరిష్కరించాలి

**గీతం సదస్సులో అభిప్రాయపడ్డ సైకాలజీ నిపుణులు**



**పటాన్ చెరు, ఆగస్టు 18, (తెలంగాణ వాణి):**
మానసిక పరిశోధన, విస్తరిస్తున్న పరిధిని, క్లిష్టమైన మానవ, సామాజిక సవాళ్లను అంతర్-విభాగ దృక్కోణాల ద్వారా పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందని మానసిక శాస్త్ర నిపుణులు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'అనిశ్చితి కాలంలో మనస్తత్వ శాస్త్రం: అంతర్-విషయ దృక్పథం, ఆవిష్కరణ, ప్రభావం' అనే అంశంపై రెండు రోజుల సదస్సును 17-18 తేదీలలో నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని అప్లైడ్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సు హైబ్రిడ్ పద్ధతిలో జరిగింది. ఇందులో మనస్తత్వశాస్త్రం, దాని అనుబంధ విభాగాలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు, నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనిశ్చితి అనేది వ్యక్తిగత జీవితాలు, కార్యాలయాలు, విద్య, ఆరోగ్యం, సాంకేతికత, సమాజాన్ని అంతకంతకూ ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో, వేగంగా మారుతున్న ఈ వాస్తవాలను మనస్తత్వ శాస్త్రం ఎలా స్పందించగలదో పరిశీలించడానికి సైకాన్ '26 ప్రయత్నించింది. ఈ సదస్సు సమకాలీన మనస్తత్వ శాస్త్ర పరిశోధన, బోధన, ఆచరణ పై విభిన్న దృక్కోణాల ను ఒకచోట చేర్చి, అంతర్-విభాగ సంభాషణకు ఒక వేదికను కల్పించింది. ఈ సదస్సులో క్లినికల్ సైకాలజీ, సైకోఅనాలిసిస్, సైకోఅనలిటిక్ సైకోథెరపీ, ఆర్గనైజేషనల్ సైకాలజీ, ఎడ్యుకేషనల్ సైకాలజీ, సోషల్ సైకాలజీ, లీగల్-ఫోరెన్సిక్ సైకాలజీ, కాగ్నిటివ్-ఎక్స్ పెరిమెంటల్ సైకాలజీ, ఎన్విరాన్ మెంటల్ సైకాలజీ, హెల్త్ సైకాలజీ, టెక్నాలజీ-ఏఐ వంటి అనేక రంగాలకు సంబంధించిన పరిశోధన పత్రాలను సమర్పించారు. జాబెర్లిన్ లోని మాక్స్ ప్లాంక్ ఇన్ స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్ మెంటుకు చెందిన సెంటర్ ఫర్ అడాప్టివ్ బిహేవియర్ అండ్ కాగ్నిషన్ (ఏబీసీ) డైరెక్టర్ డాక్టర్ గెర్డ్ గిగెరెంజర్ కీలకోపన్యాసం చేశారు. ఆయన భాగస్వామ్యం ఈ సదస్సుకు ఒక అంతర్జాతీయ దృక్కోణాన్ని తీసుకొచ్చింది. అనిశ్చిత వాతావరణంలో మనస్తత్వ శాస్త్రం, నిర్ణయాలు తీసుకోవడం, మానవ ప్రవర్తనపై చర్చలకు నాంది పలికింది. ఈ సదస్సులో మనస్తత్వ శాస్త్రం, దాని అనుబంధ రంగాలలోని విభిన్న విభాగాలకు చెందిన ప్రముఖ వక్తలు కూడా పాల్గొన్నారు. వారిలో కోల్ కతాలోని ప్రదీప్ సెంటర్ ఫర్ ఆటిజం మేనేజ్ మెంట్ డైరెక్టర్, సైకాలజిస్ట్ డాక్టర్ మల్లికా బెనర్జీ; కలకత్త విశ్వవిద్యాలయం, సైకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అనిందితా చౌధురి; ముంబై విశ్వవిద్యాలయం, అనువర్తిత మనస్తత్వశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వివేక్ బెల్హేకర్; క్లినికల్ సైకాలజిస్ట్, ఇన్నర్ హొరైజన్స్ వ్యవస్థాపకురాలు సుజాత అమేయ తదితరులు మనస్తత్వ శాస్త్రంలోని సమకాలీన ప్రశ్నలతో మమేకమయ్యేలా పండితోపన్యాసాలు, చర్చల ద్వారా ఇందులో పాల్గొన్న వారికి తోడ్పడ్డారు. సైకాన్ '26 విద్యార్థులకు, పరిశోధకులకు వారి పరిశోధనలను ప్రదర్శించడానికి, సుప్రసిద్ధ పండితులు, నిపుణులతో సంభాషించడానికి, సాంప్రదాయ విజ్ఞాన శాస్త్ర పరిధులను దాటిన దృక్కోణాలతో మమేకమవ్వడానికి అవకాశాలను కల్పించింది. విద్యా, వృత్తి, సాంకేతిక, సామాజిక సందర్భాలలో తలెత్తుతున్న సవాళ్లు, ఆవిష్కరణలో మానసిక శాస్త్ర పరిజ్ఞానాన్ని అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతను ఈ సదస్సు ప్రత్యేకంగా ప్రస్తావించింది. అప్లైడ్ సైకాలజీ విభాగ అధ్యాపకుల సహకారంతో డాక్టర్ రానితా బసు, డాక్టర్ శ్రీస్నిగ్ధ దిట్టకవి ఈ సదస్సును నిర్వహించారు. వారి సమిష్టి కృషి సైకాన్ '26 విజయవంతమైన నిర్వహణకు, ఈ విజ్ఞాన శాస్త్రంలో అర్థవంతమైన, విద్యాపరమైన చర్చలకు ఒక వేదికను అందించింది.

# మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ

### రూ.10 లక్షల నిధులతో నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల: ఆగష్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న శ్రీ లక్ష్మి మహిళా సమాఖ్య భవనానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు. మహిళా సంఘాల కార్యకలాపాలకు భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, సర్పంచ్ వంశీ, ఉప సర్పంచ్ సంతోష్, సమిండ్ల శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, ఎంఆర్ఓ హకీమ్, ఎంపీవో రవిబాబు, మాజీ సర్పంచులు బాల ముకుందం, సరోజన మల్లారెడ్డి, నరేష్, సర్పంచులు గంగమల్లయ్య, ప్రకాశ్, మాజీ ఎంపీటీసీలు కూడుకల లక్ష్మణ్, రాజ నర్సయ్య, ఏఈ విజయ్, ఏపీఎం రాజు, తిరుపతి, శేఖర్ రెడ్డి, మహిళా సంఘ నాయకులు దివ్య, భాగ్యలక్ష్మి, పద్మ, గడ్డం లక్ష్మితో పాటు వార్డు సభ్యులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్య సాయి సదన్ ఆశ్రమానికి టెలివిజన్ వితరణ



**జమ్మికుంట, ఆగస్టు 18,(తెలంగాణ వాణి ప్రతినిధి):**
పట్టణంలోని మారుతినగర్‌లో ఉన్న సత్య సాయి సదన్ ఆశ్రమంలోని దివ్యాంగ విద్యార్థుల కోసం రూ.75 వేల విలువైన టెలివిజన్‌ను వితరణ చేశారు. అమెరికాలో నివసిస్తున్న జడల రవికుమార్, రేఖ దంపతుల ఆర్థిక సహకారంతో జడల భాస్కర్‌రావు ఈ టెలివిజన్‌ను ఆశ్రమానికి అందజేశారు. దివ్యాంగ విద్యార్థుల మనోవికాసానికి, ఆనందానికి టెలివిజన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశ్రమ వ్యవస్థాపకులు సూత్రపు బుచ్చిరాములు తెలిపారు. ఆశ్రమ అభివృద్ధికి జడల కుటుంబ సభ్యులు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం తరఫున జడల కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆశ్రమ సిబ్బంది జడల భాస్కర్‌రావును ఘనంగా సన్మానించారు. అనంతరం ఆశ్రమంలో నూతనంగా నిర్మాణం జరుగుతున్న శ్రీ రామలింగేశ్వర ఆలయాన్ని జడల భాస్కర్‌రావు పరిశీలించారు. ఆలయంలో పరమశివుడు, నందీశ్వరుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు



## నూకపల్లి అర్బన్ కాలనీలో వసతుల కల్పనకు చర్యలు

**జగిత్యాల, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
నూకపల్లి అర్బన్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన స్థలాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిసరాల్లో చెత్త, పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రత పాటించాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి మురుగునీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతుల పనులను సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

## నల్గొండను రాష్ట్రంలోనే నంబర్ వన్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతా

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**నల్గొండ, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
నల్గొండ పట్టణాన్ని అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేసి తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలో రూ.23.85 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ చేశారు. ఇందులో భాగంగా రూ.9.40 కోట్లతో ఎస్టీ కాలనీ--శేషమ్మగూడెం--అద్దంకి రహదారి వరకు హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులు, రూ.14.45 కోట్లతో పానగల్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి డీఈఓ కార్యాలయం వరకు మూడు కిలోమీటర్ల రహదారి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు

## అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక సర్వాయి పాపన్న

### కేంద్రమంత్రి బండి సంజయ్



**తిమ్మాపూర్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
కరీంనగర్ రేకుర్తి 19వ డివిజన్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ మొఘల్ పాలకుల అరాచకాలకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పాపన్న గొప్ప పోరాటం చేశారని కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన పాపన్న ధైర్యసాహసాలతో గొప్ప యోధుడిగా ఎదిగారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు, స్థానికులు, యువకులు పాల్గొన్నారు.

## చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి

### టీఎస్‌యూటీఎఫ్ రాయికోడ్




**రాయికోడ్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
పీఆర్సీ ప్రకటించడంతో పాటు ఆరు విడతల డీఏలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు డిమాండ్ చేశారు. ఆగస్టు 21న సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.
రాయికోడ్ మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి సిహెచ్. అవినాష్, ఉపాధ్యక్షుడు తారా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



**రామకృష్ణాపూర్,ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాతనపల్లి మున్సిపాలిటీలో పర్యటించిన ఆయన వాటర్ ట్యాంక్, సీసీ రోడ్లు, డ్రైన్లు, వైకుంఠధామం, కూరగాయల మార్కెట్, మున్సిపల్ కార్యాలయ అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు.ప్రజలకు తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు మెరుగ్గా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్యం ఉండేలా చర్యలు చేపట్టాలని, చెత్త సేకరణ, తరలింపును సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గడువు ముగిసిన ట్రేడ్ లైసెన్సులను వెంటనే పునరుద్ధరించాలని, పెన్షన్ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మున్సిపల్ వర్కర్స్ కమిటీ ఎన్నిక




**రామకృష్ణాపూర్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి):**
తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ క్యాతనపల్లి మున్సిపాలిటీ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్. వెంకటస్వామి, అధ్యక్షుడిగా మారపల్లి మహేందర్, కార్యదర్శిగా గడ్డం రమేష్, కోశాధికారిగా కాసర్ల కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాసర్ల రాజలింగం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం అండగా ఉంటుందని తెలిపారు.

## రోడ్ల పనులు చేపట్టాలి

### మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ వినతి



**నిర్మల్ - ముధోల్: ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలో హెచ్‌ఏఎం పథకం కింద మంజూరైన రోడ్ల పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కోరారు.దెబ్బతిన్న గ్రామీణ రహదారులకు మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట్ల డబుల్‌లైన్ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బాసరలో బంజారా సంఘం ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ సంఘ భవనం నిర్మాణానికి ఒక ఎకరం స్థలం కేటాయించాలని కోరారు.దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు

## లింగంపేట్ శిశుమందిర్‌కు భారీ చేయూత



**ఎల్లారెడ్డి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
లింగంపేట్ శ్రీ సరస్వతి శిశుమందిర్ నూతన భవన నిర్మాణానికి డాక్టర్ పైడిల్లారెడ్డి భారీ చేయూత ప్రకటించారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించిన ఆయన, తనవంతు సహాయంగా 1,000 సిమెంట్ బస్తాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు

## సోనాలలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం




**ఆదిలాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సోనాల మండల కేంద్రంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 150 మంది పోలీసు సిబ్బందితో చేపట్టిన తనిఖీల్లో 232 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఫేక్ నంబర్ ప్లేట్‌తో ఉన్న కారుపై కేసు నమోదు చేశారు. గంజాయి, అక్రమ మద్యం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. వెంకట నరసయ్య హెచ్చరించారు. ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

# సర్దార్ సర్వాయి పాపన్న పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

**అదనపు కలెక్టర్ రాజేశ్వర్**

**ఆదిలాబాద్, ఆగస్టు : 18 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక, మొఘల్ సామ్రాజ్య దౌర్జన్యాలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ కొనియాడారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి సర్దార్ పాపన్న విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సామాన్య గీత కార్మిక కుటుంబంలో జన్మించిన సర్వాయి పాపన్న, పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా గెరిల్లా సైన్యాన్ని నిర్మించి సుమారు 21 కోటలను స్వాధీనం చేసుకోవడం సాహసానికి నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి స్వాతంత్ర్య సమరయోధులకు, బ్రిటిష్ పాలకులపై పోరాడేందుకు పాపన్న చరిత్ర గొప్ప స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల



కోసం పోరాడిన సర్వాయి పాపన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాదు మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఇంచార్జి బీసీ సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, చరణ్ గౌడ్, బిసి, గౌడ సంఘం నాయకులు దత్తు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# 'సర్వాయి' పోరాటం స్ఫూర్తిదాయకం:కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్:ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిది)**
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయ కమని ఆయన ఆశయాల ను అందరం కొనసాగిద్దామ ని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలు పునిచ్చారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు లో సర్వాయి పాపన్న 376 వ జయంతి నిర్వహించారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి,మున్సి పల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్,అధికారులు, బీసీ,గౌడ సంక్షేమ సంఘం నాయకులు సర్వాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.కల్లు గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్మికులకు ఎక్స్ గ్రేషియా, కాటమయ్య రక్షణ కిట్లు అందిస్తున్నట్లు వివరించా రు.సంఘం నాయకులతో మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఐక్యంగా పని చేస్తూ నియో జక వర్గాల వారీగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.చదువు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు.తమ సంఘంలో బాలికల చదువు కు పెద్దపీట వేసి వారు ఉన్నత స్థానాల్లో నిలిచేలా కృషి చేయాలన్నారు.
ఎక్సైజ్ శాఖ సమన్వయం తో జిల్లాలోని 3412 మంది కల్లుగీత కార్మికులకు (అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కరీంనగర్ 463, మానకొండూర్ 933, చొప్పదండి 975, హుజురాబాద్ 1041) కాటమయ్య సేఫ్టీ కిట్లు అందించినట్లు పేర్కొన్నారు. నగరపాలిక



కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడు తూ జనగాం జిల్లాలో ఆయన నిర్మించిన కోట ఇప్పటికీ బ్రహ్మాండంగా ఉందన్నారు.ఆ మహనీ యుడు ఆశయాలను,జీవన విధానం,దూరదృష్టి నేటి తరానికి తెలియజేయాలని పేర్కొన్నారు.
అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాపన్న లాంటి వీరులు అన్ని వర్గాలకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి,బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు,
తెలంగాణ గౌడ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పడాల స్వామి, గౌడ్ పులి ఆంజనేయులు గౌడ్,పడాల అజయ్ గౌడ్, దూలం అంజన్న గౌడ్, తాళ్లపల్లి ఎల్లగౌడ్,మాచర్ల ఆంజనేయులు గౌడ్,బుర్ర ముత్తయ్య గౌడ్,సాగర్ గౌడ్ నరసయ్య గౌడ్,రాజు గౌడ్, రమేష్ గౌడ్,మహిళా నాయకులు సుజాత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**కోరుట్ల:ఆగస్టు 18 (తెలంగాణ వాణి)**
కోరుట్ల పట్టణ జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో మంగళవారం సర్దార్ సర్వా యి పాపన్న జయంతి వేడు కలను నిర్వహించారు మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లతో కలిసి సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీని యర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం పాలనకు పునాది వేసిన వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పాపన్న పోరాటం కేవలం మొగల్ సామ్రాజ్యానికి వ్యతిరేకం కాదని ప్రజలను దోపిడీ చేస్తున్న ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిందన్నారు. భారత చరిత్రలో రాజాధికారం ప్రధానంగా వంశపారంపర్యంగా సంక్రమించిన కాలంలో ఒక శ్రమజీవి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రజల మద్దతుతో అధికారాన్ని నిర్మించడం విప్లవాత్మక పరిణామమని తెలంగాణ నేల గర్వించే వీరుడు బీసీల ముద్దుబిడ్డ అన్యాయంపై ఆయుధాన్ని ఎత్తిన యోధుడు సమానత్వం కోసం పోరాడిన మహానుభావుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు తెలంగాణ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దిశాలి తెలంగాణ తొలి స్వాతంత్ర సమరయోధులు సమాజ సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని



ఆయన ఆశయాలను మనమందరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం,పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్,కోరుట్ల నియోజక వర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి,కిసాన్ సెల్ నాయకులు శంకర్ గౌడ్ నాయకులు నజ్జు నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హైకోర్టులో ఘనంగా జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ జన్మదిన వేడుకలు

- **న్యాయ వ్యవస్థ గౌరవాన్ని,రాజ్యాంగ విలువలను కాపాడటమే ధ్యేయం.**
- **హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్**
- **మాజీ ప్రధాని,భారత రత్న స్వర్గీయ పి.వి.నర సింహరావు వారసత్వం, ఆశయాలే నాకు మార్గదర్శకం**



**?హైదరాబాద్:ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిది)**
తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) గౌరవ న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.శ్రవణ్ కుమార్ జన్మ దిన వేడుకలు హైకోర్టు ప్రాంగణంలో అత్యంత వైభవంగా,కోలాహలంగా, పండుగ వాతావరణంలో జరిగాయి.భారతదేశ దిగ్గజ నాయకుడు,మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ పి.వి. నరసింహారావు మనవడైన జస్టిస్ శ్రవణ్ కుమార్ తన తాత స్ఫూర్తితో న్యాయరం గానికి విశిష్ట సేవలందిస్తూ, సమర్థవంతమైన,నిష్పాక్షిక మైన తీర్పులతో ప్రత్యేక గుర్తింపు పొందారు.?ఈ శుభసందర్భంగా హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)ఈ.రవీందర్ రెడ్డి నేతృత్వంలో ప్రముఖ న్యాయవాదులు బోయిని ఆనంద్,గుడి మధుసూదన్ రెడ్డి,చట్ల మణికుమార్ తది తర న్యాయకోవిదులు జస్టిస్ శ్రవణ్ కుమార్ ని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి,శాలువాలతో ఘనంగా సత్కరించారు. న్యాయమూర్తిగా బాధ్యత లు స్వీకరించినప్పటి నుండి రాజ్యాంగబద్ధమైన విలువ లను కాపాడుతూ,బాధితు లకు త్వరితగతిన న్యాయం అందించడంలో ఆయన చూపుతున్న శ్రద్ధ,నిరంతర కృషి వర్ధమాన న్యాయవా దులకు ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు కొనియాడారు .ఆయనకు భగవంతుడు పరిపూర్ణ ఆయురారోగ్యాలు,సుఖ సం తోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.?తనకు శుభాకాంక్షలు తెలియజేసిన న్యాయవాదులు,కోర్టు సిబ్బంది మరియు అభిమా నులను ఉద్దేశించి గౌరవ న్యాయమూర్తి మాట్లాడు తూ ?"నన్ను ఆశీర్వదించి, ఇంతటి ప్రేమాభిమానాలను అందించిన తోటి న్యాయ మూర్తులకు,న్యాయవాదు లకు,కోర్టు సిబ్బందికి నా హృదయపూర్వక ధన్యవా దాలు.?న్యాయవ్యవస్థ అనేది ప్రజాస్వామ్యానికి,సమాజా నికి బలమైన పునాది.మా తాత,మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి.నరసింహారావు నాకు నేర్పిన విలువలు,క్రమశిక్షణ, దేశభక్తే నన్ను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టాయి. ప్రజాసేవ,రాజ్యాంగ పరి రక్షణనే ఆయన తన శ్వాస గా భావించేవారు.అదే మార్గంలో నడుస్తూ, రాజ్యాంగం పట్ల పూర్తి నిష్ఠతో పనిచేయడమే నేను ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.?సామాన్య మానవు డికి న్యాయం త్వరితగతిన, పారదర్శకంగా అందడమే మన న్యాయవ్యవస్థ ప్రధాన లక్ష్యం.బాధితులకు కాల యాపన లేకుండా న్యాయ ఫలాలు అందించడంలో న్యాయవాదుల పాత్ర అత్యంత కీలకమైనది. సీనియర్ న్యాయవాదులతో పాటు యువ న్యాయవాదు లు చట్టాలపై అవగాహన పెంచుకుని,నిరంతరం అధ్యయనం చేస్తూ బాధితు లకు అండగా నిలవాలి.నా ఈ న్యాయసేవా ప్రయాణం లో మీరందరూ చూపిస్తున్న ఈ గౌరవం,ఆప్యాయత నాపై బాధ్యతను మరింత పెంచాయి.సమాజానికి, ప్రజా సంక్షేమానికి నా శక్తి వంచన లేకుండా సేవ చేయడానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ వేడుకల్లో పలువురు హైకోర్టు సీనియర్,జూని యర్ న్యాయవాదులు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు,కోర్టు అధికారులు, సిబ్బంది అభిమానులు పాల్గొని జస్టిస్ శ్రవణ్ కుమార్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## పేదలకు వైద్య చికిత్సకు ఎల్‌వోసీ

**నిజామాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన వారికి వైద్య చికిత్స కోసం ఎల్‌వోసీలు అందిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో సారంగాపూర్‌కు చెందిన కల్పనకు గుండె చికిత్స కోసం నిమ్స్‌లో వైద్యం పొందేందుకు రూ.5 లక్షల ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఫామ్ పాండ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



**నిర్మల్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల, దిలావార్పూర్ మండలం గుండంపల్లి గ్రామాల్లో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ పర్యటించారు. గ్రామాల్లో చేపట్టిన ఫామ్ పాండ్, ఫిష్ పాండ్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్తులకు చెత్తబుట్టలు పంపిణీ చేసి, చెత్తను బయట వేయకుండా పారిశుధ్యం పాటించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించి, గ్రామీణాభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో డిపిఓ శ్రీనివాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఈఈ ఆర్డబ్ల్యుఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీని వెంటనే అమలు చేయాలి




**నిజామాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలతో కూడిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన టీజీఈజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ఉద్యోగుల సమస్యలను ప్రస్తావించారు. పెండింగ్ బిల్లులను నెలకు రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేయాలని, అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## మండల సమాఖ్య 19వ వార్షిక మహాసభ



**ఎల్లారెడ్డి, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి మండల సమాఖ్య 19వ వార్షిక మహాసభ ఎంఎస్ అధ్యక్షురాలు పావని అధ్యక్షతన, ఏపీఎం రామ్ నారాయణ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసాగర్ నుంచి కె. యమున, హాజీపూర్ నుంచి వై. మౌనిక, మల్కాపూర్ నుంచి మంగవ్వలను బోర్డు డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళలు సంఘాల ద్వారా పొందిన రుణాలతో వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అధికారులు సూచించారు. ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని కోరారు. 2025--26 ఆర్థిక లావాదేవీలను ఆమోదించారు. ఉత్తమ వీఓఏలుగా ఎంపికైన సుజాత, షఫీదోద్దీన్‌లను సన్మానించారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా మదాసు స్వామి యాదవ్

**నిజామాబాద్, ఆగస్టు 18 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



బీజేపీ ఓబీసీ మోర్చా నిర్మల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మదాసు స్వామి యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లా డుతూ బీసీలను ఏకం చేసి వారి హక్కుల కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# అలా చేస్తే కెరీర్ వేరేలా ఉండేది



'డాక్టర్ కావాలనుకొని యాక్టర్ అయ్యాను' అని చాలామంది హీరోయిన్లు చెబుతుంటారు. సాయిపల్లవి, శ్రీలీల లాంటి హీరోయిన్లయితే.. డాక్టర్ చదివి కూడా యాక్టర్లయిపోయారు. మలయాళ మందారం ఐశ్వర్య లక్ష్మి కూడా వారి దారిలోనే డాక్టర్ చదివి యాక్టరై విజయాలను అందుకుంటున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'అనుకున్నది జరక్కపోవడమే జీవితం. నన్ను డాక్టర్‌గా చూడాలని మా అమ్మానాన్నల కోరిక. నేను కూడా కష్టపడి హౌస్ సర్జన్ చేశాను. ప్రాక్టీస్ మొదలుపెడితే నా కెరీర్ వేరేలా ఉండేదేమో. కానీ నేను అనుకోకుండా మోడలింగ్ వైపు మళ్లాను. తర్వాత సినిమా పిలిచింది. తొలినాళ్లలో అమ్మానాన్నకు నా ప్రవర్తన మింగుడు పడలేదు. విజయాలు రావడం, నా నటనను అంతా మెచ్చుకోవడం.. ఇవన్నీ చూసి వాళ్లు కూడా సైలెంట్ అయిపోయారు' అంటూ ఐశ్వర్య లక్ష్మి చెప్పుకొచ్చింది. సాయిదుర్గతేజ్‌కు జోడీగా ఆమె నటించిన 'సంబరాల ఏటిగట్టు' సినిమా త్వరలోనే విడుదల కానున్నది.




# యథార్థ సంఘటనలతో..!

సామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సాం3'. కృష్ణమాయ దర్శకత్వంలో వి.విజయ నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకానుంది.. ఆదివారం టీజర్‌ను రిలీజ్ చేశారు. యథార్థ సంఘటనల ఆధారంగా సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో తాను త్రివిక్రమరాజు అనే వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తానని హీరో సామ్రాట్ తెలిపారు. భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిగ్‌బాస్ సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాయికార్తీక్, దర్శకత్వం: కృష్ణమాయ.

# నాన్‌స్టాప్‌గా 'రాపో23'

హీరో రామ్ పోతినేని స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న తాజా చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే పుదుచ్చేరి శివార్లలో 24 గంటల పాటు నిర్విరామంగా ఈ సినిమా షూటింగ్‌ను జరిపారు. హీరోగా, దర్శకుడిగా ఈ సినిమా కోసం రామ్ ఎంతగానో శ్రమిస్తున్నారని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నారని యూనిట్ వర్గాలు తెలిపాయి. 'పుదుచ్చేరిలో వేసిన భారీ సెట్‌లో తొమ్మిది రోజుల పాటు షూటింగ్ జరిపాం. ఇటీవల వర్షాల కారణంగా షెడ్యూల్‌కు బ్రేక్‌పడింది. త్వరలో మళ్లీ షూటింగ్‌ను మొదలుపెడతాం' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాత:కృష్ణ పోతినేని.






# కాంబినేషన్ సెట్?



నాగచైతన్య హీరోగా నటించిన తాజా సినిమా 'వృషకర్మ'. నాగచైతన్య కెరీర్‌లోని ఈ 24వ చిత్రం డిసెంబరులో విడుదల కానుందట. 'వృషకర్మ' తర్వాత నాగచైతన్య హీరోగా నటించబోయే సినిమాకు క్లాక్స్, బోయపాటి శ్రీను, శివ నిర్వాణ, పీఎస్ మిత్రన్ వంటి దర్శకుల పేర్లు వినిపించినప్పటికీ ఎవరూ ఫైనలైజ్ కాలేదు. తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి పేరు తెరపైకి వచ్చింది. 'సార్, లక్కీభాస్కర్, విశ్వనాథ్ అండ్ సన్స్ '.. ఇలా వరుస హిట్ చిత్రాలతో దూసుకెళుతోన్న వెంకీ అట్లూరి డైరెక్షన్ లో నాగచైతన్య ఓ సినిమా చేయనున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే.. నాగచైతన్య 25వ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ వెంకీ అట్లూరికి లభించినట్లే. మరి.. ఈ కాంబినేషన్ సెట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఈ సంగతి ఇలా ఉంచితే... నాగచైతన్యతో తాను ఎప్పుడో ఒక సినిమా చేయాల్సిందని, తన డైరెక్షన్ లో వచ్చిన కొన్ని సినిమాల కథలను నాగచైతన్యకు వినిపించానని, వివిధ కారణాల వల్ల సినిమా చేయడం కుదర్లేదని గతంలో ఓ ఇంటర్వ్యూలో వెంకీ అట్లూరి పేర్కొన్నారు.

# నవంబర్‌లో యాక్షన్ షురూ?

అల్లు అర్జున్‌తో లోకేష్ కనకరాజ్ సినిమా ప్రకటన వెలువడిన నాటి నుంచి అభిమానులు ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'పుష్ప' ఫ్రాంఛైజీ సినిమాలతో బన్నీ ఇమేజ్ తారాస్థాయికి చేరింది. మరోవైపు యాక్షన్, మాఫియా కథాంశాలతో వరుస హిట్స్ అందిస్తూ సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేశారు దర్శకుడు లోకేష్ కనకరాజ్. దాంతో వీరిద్దరి కాంబినేషన్ సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ సినిమా కోసం లోకేష్ కనకరాజ్ తన పంథాకు భిన్నంగా వినూత్న కథాంశాన్ని సిద్ధం చేస్తున్నారని, పౌరాణిక..ఫాంటసీ అంశాలు కలబోసిన కథ ఇదని వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా నవంబర్‌లో సెట్స్‌మీదకు రానుందని తెలిసింది. బాలీవుడ్‌కి చెందిన ఓ అగ్ర హీరో ఈ సినిమాలో నటించనున్నారనే టాక్ కూడా వినిపిస్తున్నది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com